www.prajanaava.in

ప్రజానావ

Telugu Daily

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 64 | ఆదివారం | 11 అక్టోబర్, 2026

రూపాయికి రక్షా కవచం

- డాలర్ల సరఫరాకు ఆర్‌బీఐ ప్రత్యేక విండో
- ఫారెక్స్ లావాదేవీలపై కఠిన ఆంక్షలు

7

బతుకమ్మ విశిష్టతను భావితరాలకు అందించాలి

మన పండుగలు, సంప్రదాయాలను కాపాడుకోవాలి

- యువత సంప్రదాయ బతుకమ్మ పాటలను నేర్చుకోవాలి
- హస్తినాపురంలో బతుకమ్మ వేడుకల్లో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

ప్రజానావ, హస్తినాపురం: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. మన పండుగలు, ఆచార వ్యవహారాలను కాపాడుకుంటూ, బతుకమ్మ పండుగ మనదని గర్వంగా చెప్పుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని హస్తినాపురం డీఆర్డీఎల్ కాలనీవాసులతో కలిసి కవిత బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. పండుగను నిర్వహించేందుకు కాలనీలో చేసిన ఏర్పాట్లను ఆమె అభినందించారు. ముఖ్యంగా యువత సంప్రదాయ బతుకమ్మ పాటలను నేర్చుకోవాలని కవిత సూచించారు. ఒక్కసారి పాట నేర్చుకుంటే అది వందేళ్లపాటు నిలిచిపోతుందని పేర్కొన్నారు. డీజే పాటలు ఉన్నప్పటికీ, సంప్రదాయ బతుకమ్మ పాటలకు కూడా ప్రాధాన్యమివ్వాలని కోరారు. మహిళలు ఆనందంగా బతుకమ్మ ఆడుకునేందుకు డీఆర్డీఎల్ కాలనీలో అద్భుతమైన ఏర్పాట్లు చేశారని ప్రశంసించారు. పండుగలకు పార్టీలు, రాజకీయాలతో సంబంధం లేదని, అందరూ కలిసికట్టుగా మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలని కవిత పిలుపునిచ్చారు.

చిత్తూ చిత్తుల బొమ్మ
శివుని ముద్దుల గుమ్మ

- ప్రారంభమైన బతుకమ్మ సంబురాలు
- తీరొక్క పూలతో బతుకమ్మలు సంప్రదాయ దుస్తుల్లో మహిళల సందడి

2

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, బతుకు చిత్రాన్నే పాటగా మలుస్తూ మహిళలు, చిన్నారులు సంబరాల్లో మునిగిపోయారు. సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు.

వెనక్కి తగ్గేది లేదు

- రాజ్యాంగాన్ని కాపాడుకుంటాం
- మోడీ, ఆరెస్సెస్‌తో పదేళ్లుగా పోరాడుతున్నా
- ఎంతమందినైనా అరెస్టు చేసుకోండి
- సీజేపీ నిరసనల వేళ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

2

ఎస్ఐఆర్‌కు మాజీ అధికారుల మద్దతు

- ఎన్నికల సంఘం నిష్పాక్షికతను సమర్థిస్తూ 124 మంది లేఖ
- ఆధారాలు లేకుండా ఓట్ల చోరీ ఆరోపణలు సరికాదు
- ఈవీఎంల భద్రత, ముగ్గురు కమిషనర్ల విధానానికీ సపోర్ట

2

సీఈసీకి వ్యతిరేకంగా

ప్రతిపక్షాల పోరు

6

ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల ఉక్కుపాదం

దేశ రాజధానిలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనల్లో పాల్గొనేందుకు వచ్చిన వేలాది మందిని పోలీసులు అడ్డుకున్నారు. నిరసన చేపట్టేందుకు వచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, పినరయి విజయన్, మాణిక్ సర్కార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నలుగురు మాజీ సీఎంలు సహా పలువురు నేతల నిర్బంధం.. జంతర్‌మంతర్‌కు వెళ్లకుండా 7వేల మందికిపైగా బందోబస్తు

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని విపక్షాల ఆగ్రహం.. మోడీ సర్కారుపై ఖర్గే, ప్రియాంక గాంధీ తీవ్ర విమర్శలు

ఎల్‌నినోతో అప్రమత్తంగా ఉండండి

తాగు, సాగునీరు.. విద్యుత్ పొదుపుపై ప్రత్యేక కార్యాచరణ

- రాబోయే 8 నెలలు కీలకం.. ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయండి
- చుక్క వృథా కావొద్దు.. పంట చేతికొచ్చే వరకు సాగునీరు అందించాలి
- పరిస్థితుల పర్యవేక్షణకు వార్‌రూమ్.. టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు
- కేంద్రాన్ని రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కోరాం: సీఎం రేవంత్‌రెడ్డి

ప్రజానావ, హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తీవ్రతరమయ్యే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యలకు పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఎల్‌నో, వర్షాభావ పరిస్థితులపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాబోయే ఎనిమిది నెలలు కీలకమని, సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు.

విద్యుత్ పొదుపుపై దృష్టి

రాబోయే రోజుల్లో విద్యుత్ కొరత తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉందని సీఎం పేర్కొన్నారు. రాష్ట్ర అవసరాల కోసం విద్యుత్ కొనుగోలుకు ఎంత ఖర్చు చేసేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో ఉండటం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని తరువాయి 2లో..

రష్యా విషయంలో ట్రంప్ ద్వంద్వ వైఖరి!

- ఇతర దేశాలపై సుంకాల కొరడా.. ఇప్పుడు అదే దేశం నుంచి డీజిల్ కొనుగోలు
- రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాల హెచ్చరికలు
- భారత్‌పై 25% అదనపు సుంకాలు విధించిన అమెరికా
- ఇంధన ధరల పెరుగుదలతో ఆంక్షల సడలింపు.. ట్రంప్ నిర్ణయంపై విమర్శలు

వాషింగ్టన్: రష్యాతో వాణిజ్య సంబంధాల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరి చర్చనీయాంశంగా మారింది. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాలు విధిస్తామని గతంలో హెచ్చరించిన ఆయన .. తాజాగా అదే దేశం నుంచి డీజిల్ కొనుగోలుకు సిద్ధమయ్యారు. రష్యాపై కొన్ని ఆంక్షాలను సడలించడంతో ట్రంప్ ద్వంద్వ ప్రమాణా లు పాటిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవు తున్నాయి. రష్యా నుంచి ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేసే దేశాల్లో చైనా ముందుండగా.. భారత్, తుర్కియే, ఐరోపా సమాఖ్య (ఈయూ) దేశాలు కూడా ప్రధాన దిగుమతిదారులుగా ఉన్నాయి. ఈ కొనుగోళ్ల ద్వారా రష్యాకు ఆదాయం సమకూరుతోందని, ఆ నిధులతో ఉక్రెయిన్ పై యుద్ధాన్ని కొనసాగిస్తోందని అమెరికా వాదిస్తోంది. ఈ కారణంతోనే రష్యా ఇంధనం కొనుగోలు చేసే దేశాలపై ఒత్తిడి పెంచింది. భారత్‌పై 25 శాతం అదనపు సుంకాలు విధించింది. రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించేందుకు వీలు కల్పించే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను కూడా ట్రంప్ జారీ చేశారు.

జాతీయ ప్రయోజనాలే ముఖ్యం

అంతర్జాతీయ పరిణామాలు, భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భారత్ తన ఇంధన దిగుమతుల వ్యూహాన్ని అనుసరిస్తోంది. రష్యాతో పాటు యూఏ ఈ, వెనెజువెలా, ఒమన్, బ్రెజిల్, ఇరాన్ తదితర దేశాల నుంచి చమురు కొను గోళ్లపై

దృష్టి సారించింది. చమురు ఎక్కడ తక్కువ ధరకు లభిస్తే అక్కడి నుంచి దిగుమతి చేసుకుంటామని, దేశ ప్రయోజ నాలే తమకు ముఖ్యమని భారత్ పలు మార్లు స్పష్టం చేసింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్ ను విమర్శించే తరువాయి 2లో..

రేడియల్ రోడ్ల టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- రూ.600 కోట్ల నష్టం ఆరోపణలపై విచారణ జరపాలి
- టెండర్లలో వందల కోట్ల అవినీతి జరిగిందని సీఎంకు కేటీఆర్

2

కాంగ్రెస్ 'ఓటు చోరీ' ప్రచారాన్ని తిప్పికొట్టండి

- శ్రేణులకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పిలుపు
- సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారమే ఓటర్ల జాబితా రూపకల్పన

2

భూములపై బీఆర్ఎస్‌ది తప్పుడు ప్రచారం

రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరగడమే రేవంత్ రెడ్డి పాలనకు నిదర్శనం

2

- భూ అక్రమాలను వెలికితీస్తున్నాం
- పెండింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

సీఈసీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల పోరు

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనలతో దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నిరసనల్లో పాల్గొనేందుకు వచ్చిన వేలాది మందిని పోలీసులు అడ్డుకున్నారు. నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, పినరయి విజయన్, మాణిక్ సర్కార్‌తో పాటు ఇండీ కూటమి నేతలు, వామపక్ష నాయకులు, సామాజిక కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. జంతర్ మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన 7 వేల మందికిపైగా నిరసనకారులను నిర్బంధించినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ముందస్తు చర్యల్లో భాగంగా నేర చరిత్ర ఉన్న 600 మందికిపైగా వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

విమానంలోనే సీజేపీ వ్యవస్థాపకుడి నిర్బంధం

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను పోలీసులు విమానంలోనే అదుపులోకి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నిరసనలో పాల్గొనేందుకు ముంబయి నుంచి ఢిల్లీకి వచ్చిన ఆయనతో పాటు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను కూడా నిర్బంధించినట్లు తెలిపాయి. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను పార్టీ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. తమ నాయకులు నిరసన ప్రదేశానికి చేరుకోకుండా ముందస్తు ప్రణాళికతో అడ్డుకున్నారని సీజేపీ ఆరోపించింది. పోలీసుల చర్యలు పౌర హక్కుల ఉల్లంఘనకు నిదర్శనమని విమర్శించింది.

కేజ్రీవాల్, మమతా బెనర్జీ అదుపులోకి

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన నివాసం నుంచి జంతర్‌మంతర్‌కు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఆప్ కార్యకర్తలు పోలీసులను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో

కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు కేజ్రీవాల్‌ను ఎత్తుకుని బస్సు వద్దకు తీసుకెళ్లారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, ఢిల్లీ పార్టీ విభాగం అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ సహా పలువురు నేతలను కూడా నిర్బంధించారు.ఎన్నికల్లో ఓట్ల చోరీ జరుగుతోందని ప్రధాని మోడీపై కేజ్రీవాల్ ఆరోపణలు చేశారు. దేశ యువత మేల్కొందని, అన్యాయానికి భయపడబోరని పేర్కొన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని సౌత్ అవెన్యూ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జంతర్‌మంతర్‌కు వెళ్లకుండా అడ్డుకోవడంతో ఆమె పార్టీ నేతలతో కలిసి అక్కడే బైఠాయించారు. ఈ నిరసనలో డెరెక్ ఓబ్రియన్, దోలా సేన్ తదితరులు పాల్గొన్నారు. మమత నోటికి బ్యాండేజ్ వేసుకుని నిరసన తెలిపారు. దేశంలో పరిస్థితి అత్యవసర పరిస్థితిని మించిపోయిందని, ఇది 'సూపర్ ఎమర్జెన్సీ'లా ఉందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడాలన్నదే తమ సందేశమని స్పష్టం చేశారు.

వామపక్ష నేతలకూ తప్పని నిర్బంధం

కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, వామపక్ష నేత బృందా కారత్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేరళ భవన్ నుంచి జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారు. పోలీసుల చర్యకు వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు.ఈ ఘటనపై విజయన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. ప్రతిపక్ష నేతలను చూసి భయపడుతున్నందుకే ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకుని, గంటపాటు వాహనాల్లో తిప్పారని విమర్శించారు. ఇలాంటి చర్యలతో ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న వారిని భయపెట్టలేరని పేర్కొన్నారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీని పోలీసు శిబిరంగా మార్చినప్పటికీ నిరసనల్లో పాల్గొనేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారని దీపాంకర్ భట్టాచార్య అన్నారు. ఒక ప్రాంతంలో నిరసనను అడ్డుకున్నంత మాత్రాన ఉద్యమ స్ఫూర్తిని ఆపలేరని వ్యాఖ్యానించారు.

నిర్బంధాలతో ప్రజలను భయపెట్టలేరు: ఖర్గే

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను నోరు మూసిన ప్రజాస్వామ్యంగా మార్చివేశారని ఆరోపించారు. బీజేపీ–ఆర్ఎస్ఎస్ పిరికితనం ఈ ఘటనతో బయటపడిందని వ్యాఖ్యానించారు. యువత, విద్యార్థులు, న్యాయవాదులు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, రైతు సంఘాల నాయకులు, యూట్యూబర్లు, కంటెంట్ సృష్టికర్తలు.. ఇలా ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ నిర్బంధిస్తున్నారని సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు.నిర్బంధాలు, అరెస్టులు, జైళ్లు, లాఠీలు, పెల్లెట్లతో భారత ప్రజలను భయపెట్టి అడ్డుకోలేరని ఖర్గే స్పష్టం చేశారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కాంగ్రెస్, ఇండీ కూటమి కలసి పోరాడతాయని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం తమ పార్టీ రక్తాన్ని చిందించిందని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, ప్రతి భారతీయుడి ప్రాథమిక హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాడుతామని పేర్కొన్నారు.

మోడీ, షాలది నియంతృత్వ పాలన: ప్రియాంక

ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశాన్ని నియంతృత్వ దిశగా నడిపిస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. భారత్ ఇక ప్రజాస్వామ్య దేశంగా లేదని విమర్శించారు. మొదట 254 మంది ఎంపీలను తీవ్రంగా కొట్టి, వారి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తూ చట్టవిరుద్ధంగా నిర్బంధించారని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఇతర నిరసనకారులపైనా ఇదే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.జాతీయ రాజధానిని దిగ్బంధించి, బారికేడ్లు ఏర్పాటు చేసి, రైళ్లు, మెట్రో సేవలను నిలిపివేసి, ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలిగించడంతో పాటు పలు ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును వినియోగించుకుంటున్న యువతను కొట్టి నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సంఘంతో కుమ్మక్కై ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వ చట్టబద్ధతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని అణచివేసేందుకు సహకరిస్తున్నవారు దేశానికి ద్రోహం చేస్తున్నారని ప్రియాంక వ్యాఖ్యానించారు.

సుప్రీంకోర్టులో పిటిషన్

ఢిల్లీలో సీజేపీ నిరసనల నేపథ్యంలో మెట్రో, రైలు సేవలను పూర్తిగా నిలిపివేయకూడదంటూ ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారని ఆరోపిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఆదివారం విచారణ చేపట్టనుంది.

వెనక్కి తగ్గేది లేదు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ, ఆరెస్సెస్‌తో గత పదేళ్లుగా పోరాడుతూనే ఉన్నానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. వారిని ఒక ప్రత్యర్థిని అర్థం చేసుకున్నట్లుగా పూర్తిగా అర్థం చేసుకున్నానని పేర్కొన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో సీజేపీ చేపట్టిన నిరసనల నేపథ్యంలో 'ఎక్స్' వేదికగా ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. ''మోడీ జీ.. మీకు నచ్చినట్లు చేసుకోండి. పోలీసులందరినీ రంగంలోకి దించండి. 10 వేల మంది, 20 వేల మంది, 50 వేల మంది.. ఎంతమందినైనా సరే. నాయకులను, యువతను.. అందరినీ అరెస్టు చేయండి. అయినా మేమంతా మిమ్మల్ని చుట్టుముడుతూనే ఉంటాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటాం. దేశ ప్రజల గొంతుకను రక్షిస్తాం. గత 10–15 ఏళ్లలో దేశానికి జరిగిన అన్యాయం ఇకపై పునరావృతం కాకుండా చూస్తాం. ఈ ప్రభుత్వాన్ని, రాజ్యాంగంపై దాడి చేసిన వారిని ఓడించేందుకు కృషి చేస్తాం'' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

ఫ్లైదుబాయ్ ఘటనపై ఎన్ఐఏ కేసు

న్యూఢిల్లీ: ఫ్లైదుబాయ్ విమానంలో కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై జరిగిన దాడి ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కేసు నమోదు చేసింది. యాంటీ హైజాకింగ్ చట్టం–2016, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా)లోని నిబంధనల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఘటన తీవ్రత, దీని వెనుక ఉన్న కుట్ర కోణాన్ని వెలికితీయాల్సిన అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు బయల్దేరిన విమానం కాక్‌పిట్‌లో కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై కోపైలట్ దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై ఇప్పటికే సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఇజ్రాయెల్ వేర్వేరుగా దర్యాప్తు చేస్తున్నాయి. తాజాగా ఎన్ఐఏ కూడా కేసు నమోదు చేయడంతో ఘటన వెనుక ఉన్న కారణాలు, కుట్ర కోణంపై విచారణ ప్రాధాన్యం సంతరించుకుంది.

డియల్ రోడ్ల టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ప్రజానావ, హైదరాబాద్: రేడియల్ రోడ్ల టెండర్ల వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ టెండర్లలో అక్రమాలు జరిగాయని, పనులను ప్యాకేజీలుగా విభజించి తమకు నచ్చినవారికి కట్టబెట్టారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో వందల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి కేటీఆర్ లేఖ రాశారు. రేడియల్ రోడ్ల టెండర్లను తక్షణమే రద్దు చేసి, వాటి కేటాయింపుల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

టెండర్ల రికార్డులు బహిర్గతం చేయాలి

రేడియల్ రోడ్ల టెండర్లకు సంబంధించిన పూర్తి రికార్డులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో రూ.600 కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లిందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. టెండర్ల ప్రక్రియ, కేటాయింపుల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేసి వాస్తవాలను వెల్లడించాలని లేఖలో పేర్కొన్నారు.

కాంగ్రెస్ 'ఓటు చోరీ' ప్రచారాన్ని తిప్పికొట్టండి

ప్రజానావ, హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని బీజేపీ తెలం గాణ అధ్యక్షుడు రాంచందర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే ఎన్నికల కమిషన్ పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందించిందని స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, మీడియా ప్యానలిస్టులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దొంగ ఓట్ల తొలగింపు పేరుతో కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఖండించారు. వరుస ఎన్నికల్లో ఓటములను ఎదుర్కొంటున్న కాంగ్రెస్.. రాజ్యాంగబద్ధ సంస్థలపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

ప్రజల్లో వాస్తవాలను వివరించాలి

కాంగ్రెస్ చేపట్టిన 'ఓటు చోరీ' ప్రచారాన్ని ప్రజల్లో ఎండగట్టాలని రాంచందర్‌రావు పార్టీ నేతలు, కార్యకర్తలకు సూచించారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి ఎలా ఉపయోగపడుతుందో ప్రజలకు వివరించాలని కోరారు. ఓటర్ల జాబితా నుంచి తమ మద్దతుదారుల పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతోంది. ఈ వ్యవహారంపై ఆ పార్టీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, జాతీయ స్థాయిలో రాష్ట్రపతిని కలిసి తమ అభ్యంతరాలను కూడా వెల్లడించారు.

రష్యా విషయంలో ట్రంప్ ద్వంద్వ వైఖరి!

(మొదటి పేజీ తరువాయి)

పాశ్చాత్య దేశాలు కూడా మాస్కోతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ గతంలో వ్యాఖ్యానించారు. ఇంధన భద్రత, ధరలు, దేశ ఆర్థిక ప్రయోజనాల ఆధారంగానే భారత్ నిర్ణయాలు తీసుకుంటోందని భారత ప్రభుత్వం చెబుతోంది.

ఇంధన ధరల ఒత్తిడితో నిర్ణయం?

ఇరాన్‌తో యుద్ధం, చమురు నౌకలపై దాడులు, సరఫరాలో అంతరాయాలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. అమెరికాలోనూ డీజిల్ ధరలు పెరగడంతో రైతులు, ట్రక్కు యజమానులు సహా పలు వర్గాలపై భారం పడుతోంది. దీంతో ఇంధన ధరలను అదుపు చేయాలన్న ఒత్తిడి ట్రంప్ ప్రభుత్వంపై పెరిగింది. ఈ నేపథ్యంలో రష్యా డీజిల్‌పై ఆంక్షలను 2027 ఏప్రిల్ వరకు సడలిస్తూ, అక్కడి నుంచి కొనుగోళ్లకు సంబంధించిన ఒప్పందం చేసుకున్నట్లు ట్రంప్ ప్రకటించినట్లు కథనంలో పేర్కొన్నారు. మధ్యంతర ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయం తీసుకున్నారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇతర దేశాలు రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సుంకాల హెచ్చరికలు చేసిన అమెరికా.. తన అవసరాల కోసం అదే దేశం నుంచి డీజిల్ కొనుగోలుకు సిద్ధం కావడం చర్చకు దారితీసింది. అయితే, ఆంక్షల సడలింపు, కొనుగోలు ఒప్పందానికి సంబంధించిన వివరాలను స్వతంత్రంగా నిర్ధారించాల్సి ఉంది.

ఎస్ఐఆర్‌కు మాజీ అధికారుల మద్దతు

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్షాలు, పౌర సమాజ సంఘాలు ఆందోళనలు నిర్వహిస్తున్న వేళ 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు ఎన్నికల సంఘానికి మద్దతుగా నిలిచారు. భారత ఎన్నికల సంఘం నిష్పాక్షికతను, ఎన్నికల నిర్వహణ విధానాన్ని సమర్థిస్తూ వారు బహిరంగ లేఖ విడుదల చేశారు. సరైన ఆధారాలు లేకుండా ఓట్ల చోరీ, ఎన్నికల రిగ్గింగ్ వంటి ఆరోపణలు చేయడం సరికాదని అభిప్రాయ పడ్డారు. నిరాధార ఆరోపణలు ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని హెచ్చరించారు. ఢిల్లీలో సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు నిరసనలు నిర్వహిస్తున్న సమయంలో మాజీ అధికారుల లేఖ వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది. తాము ఏ రాజకీయ పార్టీకి చెందినవారమూ కాదని వారు స్పష్టం చేశారు. తమ సర్వీసు కాలంలో ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాల తయారీ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) భద్రత కోసం ఏర్పాటు చేసే స్ట్రాంగ్‌రూమ్‌ల పర్యవేక్షణ వంటి బాధ్యతలు నిర్వర్తించినట్లు గుర్తుచేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఎన్నికలను రిగ్గింగ్‌కు గురైనవిగా పదేపదే అభివర్ణించడం ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు చేయాలంటే విశ్వసనీయమైన సాక్ష్యాధారాలు ఉండాలని స్పష్టం చేశారు.

గెలిస్తే నిజాయతీ.. ఓడితే అక్రమాలా?

ఎన్నికల్లో గెలిచినప్పుడు అదే వ్యవస్థను నిజాయతీగా అభివర్ణించి, ఓటమి ఎదురైనప్పుడు అక్రమాలు జరిగాయని ఆరోపించడం సరికాదని మాజీ అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థపై అనుమానాలు ఉన్నాయా? లేక ఫలితాలపై అసంతృప్తి ఉందా? అన్నది స్పష్టం చేసుకోవాలని సూచించారు. సరైన ఆధారాలు లేకుండా ఆరోపణలను ప్రచారం చేయడం ప్రజాస్వామ్య సంస్థల విశ్వసనీయతకు నష్టం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు.

బిహార్ ఎన్నికలను ఉదహరించిన అధికారులు

ఎన్నికల నిర్వహణలో వచ్చిన మార్పులకు 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికలను మాజీ అధికారులు ఉదాహరణగా ప్రస్తావించారు. ఆ ఎన్నికల్లో రీపోలింగ్ అవసరం లేకుండా ప్రక్రియ పూర్తయిందని, 1951 తర్వాత అత్యధిక ఓటింగ్ శాతం నమోదైందని లేఖలో పేర్కొన్నారు. మహిళలు కూడా రికార్డు స్థాయిలో ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఈ ఫలితాలకు వ్యక్తిగత అధికారుల మార్పుల కంటే ఎన్నికల సంఘం రూపొందించిన వ్యవస్థలోని పర్యవేక్షణ, జవాబుదారీ తనమే కారణమని వివరించారు.ఈవీఎంలు, స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతపై కూడా మాజీ అధికారులు లేఖలో వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల ఏజెంట్లు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించవచ్చని, పోలైన ఓట్ల వివరాలకు సంబంధించిన సంతకం చేసిన పత్రాలను పొందవచ్చని తెలిపారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో సీల్ చేస్తారని, సీల్స్‌పై వారి సంతకాలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం యంత్రాలను స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరు స్తారని, వాటి భద్రతా ఏర్పాట్లను అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు పర్యవేక్షించే అవకాశం ఉంటుందని వివరించారు. ఎన్నికల సంఘం లో ముగ్గురు కమిషనర్లు ఉండే విధానాన్ని కూడా మాజీ అధికారులు సమర్థించారు. ఒకే వ్యక్తి చేతిలో అధికారం కేంద్రీకృతం కాకుండా, కీలక నిర్ణయాలను సమష్టిగా చర్చించి తీసుకునేందుకు ఈ విధానం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ వ్యవస్థను 1995లో సుప్రీం కోర్టు సమర్థించిన విషయాన్ని లేఖలో ప్రస్తావిం చారు. ముగ్గురు కమిషనర్లు ఉండటం వల్ల ఏకపక్ష నిర్ణయాలకు అవకాశం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.

చిత్తూ చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ..

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, బతుకు చిత్రాన్నే పాటగా మలుస్తూ మహిళలు, చిన్నారులు సంబరాల్లో మునిగిపోయారు. సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. తొమ్మిది రోజులపాటు ఈ పూల పండుగ కనులపండువగా సాగనుంది.

తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ

మహిళలు సహజసిద్ధమైన రంగురంగుల పూలతో ఇంటింటా బతుకమ్మలను పేర్చి, పసుపుతో గౌరమ్మను తయారు చేసి భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే ఉత్సవాలు.. వరుసగా అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానే బియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయ బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మలతో కొనసాగుతాయి. చివరి రోజు సద్దుల బతుకమ్మను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తారు.

ఎక్కడ చూసినా పూల సందడే

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంతో పాటు వరంగల్, హనుమకొండ, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట , కరీంనగర్ తదితర ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో ఒకచోట చేరి బతుకమ్మ

ఆడారు. సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పూలతో అలంకరించిన బతుకమ్మలతో పండుగ వాతావరణం నెలకొంది.

పండుగకు ప్రత్యేక ఏర్పాట్లు

బతుకమ్మ వేడుకల నిర్వహణకు పురపాలక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. పండుగ జరిగే ప్రాంతాలు, చెరువు ఘాట్లు, మైదానాలకు వెళ్లే రహదారుల మరమ్మతులు చేపట్టడంతో పాటు విద్యుత్, తాగునీటి సదుపాయాలు కల్పించారు. మహిళలు, చిన్నారులు ఇబ్బందులు లేకుండా వేడుకల్లో పాల్గొనేలా అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఎల్‌నినోతో అప్రమత్తంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత మేరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేలా అవస రమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిం చారు. విద్యుత్ సరఫరాను సీఎంవో ఉన్నతా ధికారు లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిం చాలని స్పష్టం చేశారు.

చుక్క నీరు వృథా కావొద్దు

రైతులు సాగు చేసిన పంటల పరిస్థితులను అంచనా వేయాలని, పంట చేతికొచ్చే వరకు నీటి కొరత రాకుండా చూడాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్తులో నీటి సమస్య తీవ్రమయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. తాగునీరు, సాగునీటి వినియోగంలో ప్రతి చుక్కనూ పొదుపుగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గ్రామస్థాయి నుంచి అవగాహన కార్యక్రమాలు

ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సినిమా, మీడియా, కళాజాతాలు తదితర మాధ్యమాలను వినియోగిం చుకోవాలని సీఎం సూచించారు. దసరా తర్వాత గ్రామాలు, మండలాలు, జిల్లాలు, రాష్ట్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయడం ద్వారా సంక్షోభ తీవ్రతను తగ్గించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

కరువు మండలాలకు సాయం కోరాం

రాష్ట్రంలో సుమారు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని సీఎం తెలిపారు. కరువు మండలాలను ప్రకటించడంతో పాటు తగిన ఆర్థిక సాయం అందించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని గుర్తుచేశారు. రాష్ట్రానికి రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరినట్లు చెప్పారు.వీబీ–జీ రామ్ జీ పథకం కింద ప్రస్తుతం కల్పించే 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల పని కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

వార్‌రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు

ఎల్‌నినో ప్రభావంపై పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ప్రత్యేక వార్‌రూమ్ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు సీఎం వెల్లడించారు. ఆ భేటీలో పరిస్థితులను సమీక్షించి తక్షణ చర్యలపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు. అవసరమైతే అఖిలపక్ష సమావేశం నిర్వహించే అంశాన్ని కూడా చర్చిస్తామన్నారు. ఈ సమీక్షలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఈయూ కూటమి జయభేరి

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) నేతృత్వంలోని జేఏసీ కూటమి అధిక్యం సాధించింది. ఈయూ, తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ సన్నాహాలు

- రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి సమష్టి కృషి చేయాలి
- ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయి ప్రచారంపై దృష్టి సారించాలి
- కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు మంత్రుల పిలుపు

ప్రజానావ, ఖమ్మం: ఖమ్మం–నల్గొండ–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియతో పాటు క్షేత్రస్థాయిలో ప్రచార కార్యక్రమాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా నిర్వహించాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి మద్దతుగా పనిచేసి ఆయన విజయానికి కృషి చేయాలని కోరారు. పట్టభద్రుల సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించి, వారి హక్కుల కోసం పోరాడతానని ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పేర్కొన్నారు. తన విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, ఎమ్మెల్యేలు రాగమయి, కనకయ్య, రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంతూర్ పసుపు చందనాల బతుకమ్మ వేడుకలు

ప్రజానావ, ఖమ్మం : బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని ఖమ్మంలోని విజయనగర్ కాలనీలో 'ఈనాడు–ఈఎఫ్ఎం' ఆధ్వర్యంలో సంతూర్ పసుపు చందనాల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలనీకి చెందిన మహిళలు, యువతులు పెద్దఎత్తున హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ తిరుగుతూ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడారు. కోలాటాలు, నృత్యాలతో సందడి చేశారు. మహిళల ఆటపాటలతో విజయనగర్ కాలనీలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఈఎఫ్ఎం ఆర్జే శిరీష మహిళలు, యువతులతో మమేకమై సరదా సంభాషణలు నిర్వహించారు. పలు వినోదాత్మక ఆటలు, కార్యక్రమాలతో వారిని అలరించారు. మహిళల ఆటపాటలు, కోలాటాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ఉత్తమ సంప్రదాయ దుస్తులు, ఉత్తమ బతుకమ్మ, ఉత్తమ నృత్యకారిణి, ఉత్తమ అమ్మ–కూతురు ప్రదర్శన విభాగాల్లో ఎంపికైన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకుడు చంద్ర వీరభద్రరావు పర్యవేక్షించారు.

అక్టోబరులోనూ విద్యుత్తు వినియోగం జోరు

- ఎల్‌నినో ప్రభావంతో పెరిగిన డిమాండ్
- సరఫరాకు అంతరాయాలు
- ఐదు లక్షల ఎకరాల్లో పంటలు
- నీరందక ఎండిపోతున్నాయని రైతుల ఆందోళన
- రెండు కొత్త ఉపకేంద్రాలు.. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు

ప్రజానావ, ఆదిలాబాద్ : జిల్లాలో వాతావరణ పరిస్థితులు సాధారణానికి భిన్నంగా మారడంతో విద్యుత్తు వినియోగం భారీగా పెరుగుతోంది. సాధారణంగా అక్టోబరు నెలలో వాతావరణం చల్లబడటంతో ఏసీల వినియోగం తగ్గుతుంది. వ్యవసాయ రంగంలోనూ వర్షాధారంగా పంటల సాగు కొనసాగుతుంది. అయితే ఈసారి ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, ఎండల తీవ్రత పెరగడంతో విద్యుత్తు వినియోగం ప్రతి నెలా నిర్దేశించిన కోటాను మించి నమోదవుతోంది. అధికారుల అంచనాలకు మించి డిమాండ్ పెరగడంతో గృహావసరాలతో పాటు వ్యవసాయ రంగానికి విద్యుత్తు సరఫరాలోనూ తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. వర్షాలు కురవకపోవడంతో బోర్లు ఉన్న రైతులు మోటార్లను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ఇళ్లలోనూ విద్యుత్తు వినియోగం పెరిగింది. జిల్లాలో ఈ ఏడాది సుమారు ఐదు లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా, ప్రస్తుతం అవి పూత, కాత దశలో ఉన్నాయి. ఈ సమయంలో పంటలకు నీటి అవసరం అధికంగా ఉంటుంది. అయితే వ్యవసాయానికి 24 గంటలకు బదులుగా 12 గంటలు మాత్రమే విద్యుత్తు సరఫరా చేస్తుండటంతో పంటలకు తగినంత నీరందడం లేదని, పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సీజన్‌లో తొలిసారిగా విద్యుత్తు వినియోగం నిర్దేశిత కోటాను మించడం గమనార్హం. జిల్లాకు రోజువారీగా కేటాయించిన విద్యుత్తు కోటా 1.21 మిలియన్ యూనిట్లు కాగా, ప్రస్తుతం అంతకంటే అధికంగా వినియోగం నమోదవుతోంది. మరోవైపు ఉక్కపోత కారణంగా పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వినియోగం పెరగడంతో విద్యుత్తు డిమాండ్ మరింత అధికమవుతోంది. వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ, పెరిగిన లోడ్ కారణంగా తరచూ ఫ్యూజులు కాలిపోవడం, విద్యుత్తు ట్రిప్పింగ్ సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు.

రెండు కొత్త ఉపకేంద్రాల ఏర్పాటు

గతంతో పోలిస్తే ఈ సీజన్‌లో విద్యుత్తు డిమాండ్ భారీగా పెరిగిందని అధికారులు తెలిపారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా లోడ్ పెరిగే అవకాశాన్ని ముందుగానే గుర్తించి విద్యుత్తు వ్యవస్థను బలోపేతం చేసినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడంతోపాటు ఆరు అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, మరో 154 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్తు అవసరాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో రెండు కొత్త ఉపకేంద్రాలను సైతం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఫలక్‌నుమా ఖాళీ మాతా ఆలయంలో భక్తులకు కనీస వసతులు కల్పించాలి

- వేలాది మంది భక్తులు వచ్చే ఆలయంలో సౌకర్యాలు ఏర్పాటు చేయడం ప్రభుత్వ బాధ్యత
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

ప్రజానావ,హైదరాబాద్: పాతబస్తీలోని ఫలక్‌నుమా ఖాళీ మాతా ఆలయానికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని కోరారు. నిత్యం వేలాది మంది భక్తులు సందర్శించే ఆలయంలో కనీస వసతులు లేకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఫలక్‌నుమాలోని ఖాళీ మాతా ఆలయాన్ని సందర్శించిన కవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఖాళీ మాతా ఆలయంపై హైదరాబాద్ ప్రజలకు ఎంతో నమ్మకం ఉందని, అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని తెలిపారు. అలాంటి ఆలయంలో కనీస సౌకర్యాలు లేకపోవడం విచారకరమన్నారు. ఆలయానికి చేరుకునేందుకు సరైన రహదారి సౌకర్యం లేదని, మహిళల కోసం వాష్‌రూమ్‌లు కూడా అందుబాటులో లేవని పేర్కొన్నారు. ఆలయం చుట్టూ రైల్వే భూములు ఉండటంతో పాటు పక్కనే శ్మశానం ఉండటం వల్ల రహదారి నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఎండోమెంట్ శాఖ, రైల్వే అధికారులతో మాట్లాడతానని కవిత తెలిపారు. ఆలయానికి రహదారి సౌకర్యం కల్పించడంతో పాటు భక్తులకు అవసరమైన వసతుల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కూడా ఈ అంశంపై చొరవ తీసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ

బతుకమ్మ పండుగ ప్రారంభం కానున్న సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ కవిత శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఆడబిడ్డలంతా సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బతుకమ్మను సాంస్కృతిక వారధిగా మలుచుకున్నామని గుర్తుచేశారు. ఇప్పుడు సకల జనుల వికాసం, బహుజన తెలంగాణ సాధన కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్టు చేశారు.

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత డొల్ల

- నిధులు విడుదలైనా కొరవడిన పర్యవేక్షణ
- 829 రహదారులు మంజూరు.. 670 పనులే పూర్తి
- అసంపూర్తి పనులు.. కొద్దిరోజులకే బయటపడుతున్న లోపాలు

ప్రజానావ, ఆదిలాబాద్ : గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల సమస్యను పరిష్కరించేందుకు వీబీజీ రామ్‌జీ పథకం కింద నిధులు విడుదల కాగా, చేపట్టిన సీసీ రహదారుల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుత్తేదారులు నిబంధనలను పట్టించుకోకుండా పనులు చేపట్టడంతో నిర్మాణాలు పూర్తయిన కొద్దిరోజులకే లోపాలు బయటపడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయకపోవడం వల్లే పనుల్లో నాణ్యత కొరవడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 20 మండలాల్లోని 472 గ్రామ పంచాయతీల పరిధిలో గతేడాది వీబీజీ రామ్‌జీ పథకం కింద 829 సీసీ రహదారులు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటివరకు 670 పనులు మాత్రమే పూర్తయ్యాయి. రహదారి నిర్మాణ పనులు దక్కించుకున్న గుత్తేదారులు వివిధ కారణాలు చూపుతూ పనులను ఆలస్యం చేశారని, ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో హడావుడిగా నిర్మాణాలు చేపట్టారని విమర్శలు ఉన్నాయి. అయినప్పటికీ సాంకేతిక కారణాలతో ఆశించిన స్థాయిలో పనులు పూర్తికాలేదు. మరోవైపు అధికారపక్ష నాయకులు, పంచాయతీ పాలకవర్గాల మధ్య నెలకొన్న విభేదాల కారణంగా పలు ప్రాంతాల్లో పనులు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. గ్రామాల పర్యటనకు వచ్చిన ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ దృష్టికి స్థానికులు రహదారుల సమస్యలను తీసుకెళ్లినా పనులకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు అత్యవసరమైన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, కీలక నేతలు సూచించిన ప్రాంతాలకే ప్రాధాన్యం ఇచ్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిధులు మంజూరైనప్పటికీ పనులు పూర్తికాకపోవడం, పూర్తయిన రహదారుల్లోనూ నాణ్యత లోపాలు కనిపిస్తుండటంతో నిర్మాణాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, నాణ్యత ప్రమాణాలు పాటించని పనులపై చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.

వాన కోసం రైతన్నల ఎదురుచూపులు

- పది రోజులుగా జాడలేని వర్షం.. నెర్రలు బారుతున్న వరి పొలాలు
- పూత, కాత దశలో వాడిపోతున్న పత్తి

ప్రజానావ, ఆసిఫాబాద్: వర్షాలు ముఖం చాటేయడంతో పంటలను కాపాడుకునేందుకు జిల్లా రైతులు అల్లాడుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్ ప్రారంభం నుంచే ఆశించిన స్థాయిలో వర్షాలు లేక వాగులు, వంకలు, చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండలేదు. దీంతో వ్యవసాయశాఖ అధికారులు ముందస్తుగా వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని క్షేత్రస్థాయిలో సదస్సులు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. అయితే ఆగస్టులో కురిసిన అడపాదడపా వర్షాలను నమ్ముకుని పలువురు రైతులు వరి నాట్లు వేశారు. ప్రస్తుతం పంట కీలక దశలో ఉండగా, పది రోజులుగా వర్షాలు కురవకపోవడంతో పొలాలు నెర్రలు బారి పైరు కళ్లముందే ఎండుముఖం పడుతోంది. పెట్టిన పెట్టుబడులైనా దక్కించుకోవాలనే ఆశతో రైతులు రాత్రింబవళ్లు పొలాల వద్దే ఉంటూ అందుబాటులోకి వస్తున్న కొద్దిపాటి నీటిని తమ పంటలకు మళ్లించుకుంటున్నారు. జిల్లాలో ఈసారి సుమారు 35,600 ఎకరాల్లో వరి సాగైనట్లు అంచనా. చెరువులు, కాలువల నుంచి వస్తున్న కొద్దిపాటి నీటిని పొలాలకు మళ్లించుకునేందుకు రైతుల మధ్య పోటీ నెలకొంది. కాలువల వద్ద నీటి కోసం రైతులు పరస్పరం వాగ్వాదాలకు దిగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. రాత్రివేళల్లో టార్చిలైట్లు, సెల్‌ఫోన్ లైట్ల సహాయంతో పొలాల వెంట తిరుగుతూ చివరి ఆయకట్టు వరకు నీటిని పారించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. మరికొందరు రాత్రంతా రోడ్లు, కల్వర్టులపై దుప్పట్లు వేసుకుని అక్కడే నిద్రిస్తున్నారు. సిర్పూర్ డివిజన్ పరిధిలోని బెజ్జూరు సమీపంలో ఉన్న గొల్లబాయి చెరువు నీటి కోసం రైతులు పొలాల వద్దే ఉంటూ రాత్రింబవళ్లు నీటిని మళ్లించుకుంటూ మడులను తడిపిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వాగులు, ఒర్రెల నుంచి లభిస్తున్న నీటిని ఆయిల్ ఇంజన్ల సాయంతో పొలాలకు తరలిస్తున్నారు. ఆలస్యంగా కురిసిన వర్షాలను నమ్ముకుని వరి సాగు చేసినా, పంట పొట్ట దశకు చేరుకునే సమయంలో వర్షాలు ముఖం చాటేయడంతో ఏటా ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జిల్లాలో ఈసారి పత్తి సాగు కూడా ఆలస్యంగా ప్రారంభమైంది. సుమారు 3.77 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు తెలుస్తోంది. అడపాదడపా కురిసిన వర్షాలతో పత్తి మొక్కలు ఏపుగా పెరిగి ప్రస్తుతం పూత, కాత దశకు చేరుకున్నాయి. అయితే పది రోజులుగా వర్షాలు లేకపోవడంతో పాటు ఎండలు తీవ్రంగా ఉండటంతో మొక్కలు వాడిపోతున్నాయి. ఈ కీలక సమయంలో కనీసం ఒక మంచి వర్షం కురవకపోతే పత్తిలో ఆశించిన దిగుబడి సాధించడం కష్టమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతుల సమస్యలపై ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు యాత్ర

ప్రజానావ, ఆదిలాబాద్: రైతుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు భాజపా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు రైతుయాత్ర చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రకటించారు. ఆదిలాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎంపీ గోడం నగేశ్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నారాయణతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాయల్ శంకర్ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో, కాంగ్రెస్ ప్రభుత్వ మూడేళ్ల పాలనలోనూ రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని విమర్శించారు. రైతులకు భరోసా కల్పించడంతో పాటు వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా ఈ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.రైతుయాత్ర ప్రారంభమయ్యేలోగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారిని ఆదుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలని పాయల్ శంకర్ విజ్ఞప్తి చేశారు.

ఆడపిల్లలపై వివక్ష.. ఇంకా మారని తీరు

- బాలికల చదువుకు దూరం.. కొనసాగుతున్న బాల్య వివాహాలు
- ఉమ్మడి పాలమూరులో 10 ఏళ్లలో 487 బాల్య వివాహాలకు అడ్డుకట్ట
- 2024లో బాలుర కంటే 8,888 మంది బాలికలు తక్కువగా జననం

ప్రజానావ, మహబూబ్‌నగర్ : ఆడపిల్ల పుడితే ఖర్చులు పెరుగుతాయనే భావనతో చిన్నతనంలోనే చదువుకు దూరం చేస్తున్న ఘటనలు ఇంకా అక్కడక్కడా కనిపిస్తున్నాయి. బాలికల పట్ల వివక్ష కారణంగా బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, పోషకాహార లోపం వంటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. కాలం మారుతున్నా కొన్ని కుటుంబాల్లో ఆడపిల్లల పట్ల దృక్పథం మారకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అక్టోబరు 11న అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో బాలికల పరిస్థితిపై ప్రత్యేక కథనం.

ఇంకా మారాల్సిన దృక్పథం..

గతంతో పోలిస్తే తల్లిదండ్రుల్లో ఆడపిల్లల పట్ల అవగాహన పెరిగింది. విద్య, ఉపాధి, సామాజిక హోదా వంటి అన్ని రంగాల్లో బాలికలకు సమాన అవకాశాలు కల్పించాలనే సందేశం విస్తృతంగా వినిపిస్తోంది. సామాజిక, సాంస్కృతిక అడ్డంకులను అధిగమిస్తూ బాలికలు నేడు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో వివక్ష కొనసాగుతోంది. కొందరు తల్లిదండ్రులు బాలురను పాఠశాలలకు పంపుతూ, బాలికలను పనులకు పంపిస్తున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ తనిఖీల్లో పనుల్లో మగ్గుతున్న బాలికలు అధికంగా కనిపిస్తున్నారని అధికారులు గుర్తిస్తున్నారు. బడిబయటి పిల్లలను సగటున 2,500 మందిని గుర్తిస్తే, వారిలో సుమారు 1,400 మంది బాలికలే ఉండటం పరిస్థితికి అద్దం పడుతోంది.

కాగితాలకే ప్లాస్టిక్ నిషేధం

- నాలుగేళ్లుగా అమలు కాని నిబంధనలు
- వీధికో నిషేధిత కవర్
- పట్టించుకోని పుర అధికారులు
- ఉమ్మడి జిల్లాలో రోజూ 220 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రజానావ, నల్గొండ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ వస్తువుల వినియోగం ఉమ్మడి నల్గొండ జిల్లాలో యథేచ్ఛగా కొనసాగుతోంది. నాలుగేళ్ల క్రితమే కొన్ని రకాల ప్లాస్టిక్ వస్తువులు, సంచులపై నిషేధం విధించినా అధికారుల నిర్లక్ష్యం, ప్రజల అలసత్వంతో ఆ నిబంధనలు క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. నిత్యం తనిఖీలు నిర్వహించి నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన పుర అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో ప్లాస్టిక్ వినియోగం ఏమాత్రం తగ్గడం లేదు. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వస్తువులతోపాటు 120 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ సంచులు, పీవీసీ బ్యానర్లపై 2022 నుంచే నిషేధం అమల్లో ఉంది. అయితే క్షేత్రస్థాయిలో నిబంధనలు అమలు కాకపోవడంతో ప్రభుత్వ ఉత్తర్వులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని పలు పట్టణాల్లో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను బహిరంగంగా విక్రయిస్తున్నా పుర అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు సిబ్బంది ప్లాస్టిక్ వస్తువుల విక్రయదారుల నుంచి డబ్బులు తీసుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. నిషేధిత వస్తువులను విక్రయించే వారిపై రూ.500 నుంచి రూ.5 వేలకుపైగా జరిమానాలు విధించే అవకాశం ఉన్నా నిబంధనలు సక్రమంగా అమలు కాకపోవడంతో వీధి వ్యాపార స్థలాల నుంచి దుకాణాల వరకు నిషేధిత ప్లాస్టిక్ సంచుల వినియోగం విచ్చలవిడిగా కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా నల్గొండ నగరంతోపాటు వివిధ పురపాలికల్లో రోజూ సుమారు 220 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతున్నట్లు అంచనా. పూలు, పాలు మొదలుకొని టిఫిన్లు, పండ్లు, కూరగాయలు, చికెన్, మటన్ వంటి మాంసాహార పదార్థాల కొనుగోళ్ల సమయంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం తప్పనిసరిగా మారింది. అనేక ప్రాంతాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అధికంగా వినియోగిస్తున్నారు. వివాహాలు, ఇతర శుభకార్యాల్లోనూ ప్లాస్టిక్‌తో తయారైన గ్లాసులు, ప్లేట్లు, కప్పులు, స్పూన్లు, అలంకరణ వస్తువులను పెద్దఎత్తున ఉపయోగిస్తున్నారు. మరోవైపు ఇటీవల ప్లాస్టిక్ నీళ్ల సీసాల వినియోగం కూడా భారీగా పెరిగింది. వాటిని వినియోగించిన అనంతరం ఎక్కడపడితే అక్కడ పడేస్తుండటంతో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోంది. నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ, నకిరేకల్ తదితర పట్టణాల్లో ప్లాస్టిక్ వస్తువుల వ్యాపారం కోట్ల రూపాయల్లో సాగుతున్నట్లు అంచనా వేస్తున్నారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించడంతోపాటు ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

మొదలైన బతుకమ్మ సంబురాలు

- తొమ్మిది రోజుల పాటు తెలంగాణ పల్లెలు, పట్టణాల్లో పండుగ సందడి
- తీరొక్క పూలతో బతుకమ్మల అలంకరణ
- ఆటపాటలతో ఆడబిడ్డల కోలాహలం

ప్రజానావ, సూర్యాపేట: తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో ఇష్టంగా జరుపుకునే బతుకమ్మ పండుగ నేటి నుంచి ప్రారంభం కానుంది. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ వేడుకలను మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో ఆటపాటలతో ఉత్సాహంగా నిర్వహించనున్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పుడమితల్లి గొప్పతనాన్ని కీర్తించే పాటలతో పల్లెలు, పట్టణాల్లో పండుగ శోభ నెలకొననుంది. బతుకమ్మ పండుగలో పూలకే ప్రత్యేక స్థానం ఉంది. తంగేడు, గునుగు, గన్నేరు, బంతి, పోకబంతి, చామంతి, బీర, గుమ్మడి, తామర తదితర పూలతో పాటు స్థానికంగా లభించే వివిధ రకాల పూలను సేకరించి తొమ్మిది వరుసలుగా బతుకమ్మను అందంగా పేర్చుతారు. వివిధ రంగులతో అలంకరించిన గునుగు పూలు కూడా మార్కెట్లలో అందుబాటులో ఉన్నాయి. పూలను అందంగా పేర్చి మధ్యలో గౌరమ్మను కొలువుదీర్చి పూజలు నిర్వహించి మంగళహారతులు సమర్పిస్తారు. బతుకమ్మ పండుగలోని తొమ్మిది రోజులను మాతృత్వానికి ప్రతీకగా భావిస్తారు. ఈ కారణంగా సంతాన సాఫల్యంతో ముడిపడిన వేడుకగానూ బతుకమ్మకు ప్రత్యేక గుర్తింపు ఉంది. గౌరమ్మను కీర్తిస్తూ ఆలపించే పాటల్లో గర్భిణుల ఆరోగ్యం, ఆహారపు అలవాట్లకు సంబంధించిన సూచనలు ఉండటం ఈ పండుగలోని మరో విశిష్టత. ఈ సమయంలో చేసే దానధర్మాల వల్ల అమ్మవారి అనుగ్రహం లభించడంతో పాటు సంతాన భాగ్యం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. బతుకమ్మ వేడుకల్లో ప్రతిరోజూ ప్రత్యేకత ఉంటుంది. రోజుకో రకమైన నైవేద్యాన్ని తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు. మొదటి రోజును ఎంగిలిపూల బతుకమ్మగా పిలుస్తారు. బతుకమ్మ అలంకరణకు ఉపయోగించే పూలను ముందురోజే సేకరించి నీటిలో ఉంచడం ఈ ఆచారంలో భాగంగా కొనసాగుతోంది. తొమ్మిదో రోజున నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకలతో పండుగ ముగుస్తుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు.

శ్రీవారి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కార్యక్రమానికి భట్టి విక్రమార్కకు మంత్రి తుమ్మల ఆహ్వానం



ప్రజానావ, ఖమ్మం: ఖమ్మం నగరంలోని అల్లిపురం–కొత్తగూడెం గ్రామాల మధ్య తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఈ నెల 12న శంకుస్థాపన జరగనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శాలువాతో సత్కరించి, కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు.

బతుకమ్మ కుంటలో విషాదం

ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి



ప్రజానావ, నారాయణఖేడ్: బతుకమ్మ పండుగ వేళ అమ్మవారి పూజలకు ఇల్లు శుభ్రం చేసుకున్న ఓ రైతు కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. దుస్తులు ఉతికేందుకు బతుకమ్మ కుంటకు వెళ్లిన కుటుంబ సభ్యుల్లో ముగ్గురు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఒకరిని కాపాడేందుకు మరొకరు నీటిలోకి దిగడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మసూరు గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి, అయన భార్య కృష్ణవేణి, కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి, తమ్ముడు సంగారెడ్డితో కలిసి సంగమేశ్వర బతుకమ్మ కుంట వద్దకు దుస్తులు ఉతికేందుకు వెళ్లారు. ఈ క్రమంలో సంగారెడ్డి ప్రమాదవశాత్తు కుంటలో పడిపోయాడు. చిన్నాన్నను కాపాడేందుకు హర్షవర్ధన్‌రెడ్డి నీటిలోకి వెళ్లి చేయి అందించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో అతడూ నీటిలో పడిపోయాడు. ఇది గమనించిన నర్సింహారెడ్డి కుమారుడిని, తమ్ముడిని రక్షించేందుకు కుంటలోకి దిగారు. అయితే నీరు లోతుగా ఉండటంతో వారిని కాపాడలేక పోయారు. కుటుంబ సభ్యులు నీటిలో మునిగిపోతుండటాన్ని చూసిన కృష్ణవేణి కూడా వారిని రక్షించే ప్రయత్నంలో కుంటలోకి దిగారు. ఈ ప్రమాదంలో నర్సింహారెడ్డి, కృష్ణవేణి, సంగారెడ్డి ప్రాణాలు కోల్పోగా, హర్షవర్ధన్‌రెడ్డి చెట్టుకొమ్మను పట్టుకుని బయటపడి ప్రాణాలతో నిలిచాడు. తన కళ్లముందే తల్లిదండ్రులు, చిన్నాన్నను కోల్పోయిన బాలుడు గుండెలవిసేలా రోదించడం అక్కడివారిని కలచివేసింది. నర్సింహారెడ్డి, కృష్ణవేణి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఇంటర్ చదువుతుండగా, చిన్న కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. కుటుంబానికి ఆధారంగా ఉన్నవారు ముగ్గురూ మృతిచెందడంతో ఆ కుటుంబం దిక్కులేనిదిగా మారింది. కుమారులు, కోదలిని కోల్పోయిన ఇంటి పెద్ద వీరమణి శోకసంద్రంలో మునిగి పోయింది. 'దేవుడా.. ఎంత పని చేశావయ్యా! నాకంటే ముందే నా పిల్లలను తీసుకుపోయావా?' అంటూ ఆమె విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఈ విషాద ఘటనపై మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పేద రైతు కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడం బాధాకరమని పేర్కొంటూ, మృతుల కుటుంబానికి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించాలని కోరారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డి, నారాయణఖేడ్ పురాధ్యక్షుడు నగేష్ శెట్కార్ కూడా బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.

అనుమతుల్లేకుండానే నీటి ప్లాంట్లు

- జిల్లాలో వీధికో ఆర్ఓఆర్ కేంద్రం
- నాణ్యత పరీక్షలు నిల్
- ఐదు పురపాలికల్లో 855, గ్రామాల్లో 1,112 ప్లాంట్లు
- నిబంధనలు గాలికి.. పట్టించుకోని అధికారులు

ప్రజానావ, సూర్యాపేట: జిల్లాలో ఆర్ఓఆర్ వాటర్ ప్లాంట్ల నిర్వహణ నిబంధనలకు విరుద్ధంగా సాగుతోంది. ఇళ్లకు మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్నప్పటికీ ప్రజలు తాగునీటి కోసం మినరల్ వాటర్‌పై ఆధారపడుతున్నారు. ఇదే అదనుగా గ్రామాలు, పట్టణాల్లో వీధికో ఆర్ఓఆర్ ప్లాంటు వెలుస్తోంది. 20 లీటర్ల నీటికి రూ.10 చెల్లిస్తున్నా.. ఆ నీరు ఎంతవరకు శుద్ధమైనది, తాగేందుకు సురక్షితమైనదా అనే విషయాన్ని వినియోగదారులు తెలుసుకునే పరిస్థితి లేదు. ఆర్ఓఆర్ ప్లాంటు నిర్వహించే వారు తప్పనిసరిగా కెమిస్ట్రీ ల్యాబ్ ఏర్పాటు చేయాలి. నిష్ణాతులైన సిబ్బందితో ప్రతిరోజూ నీటి నాణ్యతను పరీక్షించాలి. నీటిలో క్లోరిన్ శాతం, ఇతర మినరల్స్ పరిమాణం, నీరు తాగేందుకు శ్రేయస్కరంగా ఉందా లేదా వంటి అంశాలను రసాయన పద్ధతుల్లో పరీక్షించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్లాంటులోనే ప్రత్యేకంగా ల్యాబ్ అందుబాటులో ఉండాలి. అయితే జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి పురపాలికలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ నిబంధనలు పాటించకుండానే పలు నీటి శుద్ధి కేంద్రాలు కొనసాగుతున్నాయి. అంతేకాకుండా ప్లాంట్లలో నీటిని శుద్ధి చేసే సమయంలో వెలువడే వృథా నీటిని భూమిలోకి ఇంకేలా భారీ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం కూడా తప్పనిసరి. ఈ ఏర్పాట్లన్నింటినీ పరిశీలించిన తర్వాతే అధికారులు ప్లాంట్లకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అవేవీ లేకుండానే పలు ప్రాంతాల్లో నీటి ప్లాంట్లు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. తహసీల్దార్ స్థాయి నుంచి మునిసిపల్ కమిషనర్ వరకు ఆర్ఓఆర్ ప్లాంట్ల నిర్వహణ తీరును తనిఖీ చేసే అవకాశం ఉన్నప్పటికీ తనిఖీలు అంతంతమాత్రంగానే ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ కార్యదర్శులు, ఎంపీడీవోలు సైతం ప్లాంట్ల నిర్వహణపై తనిఖీలు చేపట్టకపోవడంతో నిబంధనల ఉల్లంఘనలకు అడ్డుకట్ట పడటం లేదు. జిల్లాలోని ఐదు పురపాలికల్లో 855, గ్రామీణ ప్రాంతాల్లో 1,112 నీటి శుద్ధి కేంద్రాలు ఉన్నట్లు సమాచారం. వీటిలో పదుల సంఖ్యలో మాత్రమే అధికారిక అనుమతులు పొందగా.. మిగిలిన వాటిలో అనేకం అనధికారికంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఆర్ఓఆర్ వాటర్ ప్లాంట్ల నిర్వహణపై అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు కనిపించడం లేదు. నిబంధనల ప్రకారం రుసుము చెల్లించి అధికారిక అనుమతులు పొందాల్సి ఉన్నప్పటికీ, కొన్ని చోట్ల పురపాలిక సంఘాల నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవడాన్నే ప్లాంటు నిర్వహణకు అనుమతిగా భావిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో అయితే కనీస అనుమతులు కూడా లేకుండానే పలు నీటి ప్లాంట్లు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ప్రజల ఆరోగ్యానికి నేరుగా సంబంధించిన తాగునీటి నాణ్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్లాంట్లను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఘనంగా బతుకమ్మ సంబురాలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ
- విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపల్ రమేష్ సూచన

ప్రజానావ, గట్టుప్పల్: నల్గొండ జిల్లా గట్టుప్పల్ మండల కేంద్రంలోని కలురామ్ ఘర్మా విద్యాదాయనీ విద్యాలయంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రమేష్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ప్రకృతిని ఆరాధించడం, పూలను పూజించడం, ఐకమత్యంతో పండుగలను జరుపుకోవడం బతుకమ్మ పండుగ ప్రధాన సందేశమని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులు తెలుసుకోవడంతో పాటు వాటిని భావితరాలకు అందించే బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊకచెట్టి వాగుపై ఇసుక దందా

- రాత్రివేళల్లో యథేచ్ఛగా తరలింపు
- అధికారుల సహకారంతోనే అక్రమ వ్యాపారమంటున్న స్థానికులు
- పలుమార్లు పట్టుబడినా ఆగని ఇసుక దోపిడీ

ప్రజానావ, వనపర్తి: ఉమ్మడి జిల్లాలోని అతి పెద్ద వాగుల్లో ఊకచెట్టి వాగు ఒకటి. నారాయణపేట, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల మీదుగా ప్రవహించే ఈ వాగు ప్రస్తుతం ఇసుక అక్రమ తరలింపునకు అడ్డాగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో వాగులో నీటి ప్రవాహం తగ్గిపోవడంతో ఇసుక తేలింది. ఇదే అదనుగా భావిస్తున్న అక్రమార్కులు రాత్రివేళల్లో ఇసుకను యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మదనాపురం మండల పరిధిలో ఊకచెట్టి వాగు సుమారు ఏడు కిలోమీటర్లకు పైగా విస్తరించి ఉండగా, పరివాహక గ్రామాలకు చెందిన కొందరు ఇసుక తరలింపును నియంత్రించే వారు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా దందా సాగిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. శంకరమ్మపేట సమీపంలోని కానాయపల్లి శంకరసముద్రం వాగు వద్ద కొందరు ఇసుకను తరలించే పనిలో నిమగ్నమయ్యారు. శంకరమ్మపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు రోజు తప్పించి రోజు రాత్రివేళల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఒడ్డుకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి టిప్పర్లలో కొత్తకోట మండలంలోని రామనాథపురం మీదుగా జాతీయ రహదారికి చేర్చి షాద్‌నగర్, హైదరాబాద్ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారం అధికారుల సహకారంతోనే సాగుతోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. సుమారు 25 రోజుల కిందట వాగు నుంచి ఒక లారీతో పాటు రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి వాహనాలను స్వాధీనం చేసుకుని ఠాణాకు తరలించారు. కేసు నమోదు చేసినప్పటికీ ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగలేదని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు కరివెన శివారులో చిన్నచింతకుంట మండలం నుంచి వచ్చే ఊకచెట్టి వాగు విస్తరించి ఉండటంతో అక్కడ కూడా ఇసుక తరలింపు కొనసాగుతోంది. కొందరు ఎద్దులబండ్ల ద్వారా ఇసుకను తరలించి పొలాల వద్ద నిల్వ చేసుకుంటున్నారు. అనంతరం రాత్రివేళల్లో ట్రాక్టర్ల ద్వారా ఆత్మకూరు, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. గోవిందహళ్లి, దంతనూరు గ్రామాలకు చెందిన కొందరు సైతం ఎద్దులబండ్ల ద్వారా ఇసుకను తరలించి నిర్మానుష్య ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రివేళల్లో కొత్తకోటతో పాటు ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నారు. వాగు నుంచి విచ్చలవిడిగా ఇసుక తరలించడంతో భూగర్భ జలాలపై ప్రభావం పడుతోందని గోవిందహళ్లి, దంతనూరు గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఊకచెట్టి వాగులో అక్రమ ఇసుక తరలింపునకు అడ్డుకట్ట వేసి, ఇసుక దందాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఒక్క చుక్క రక్తం.. మరో ప్రాణానికి పునర్జన్మ

- రక్తదానంతో ఆపదలో ఉన్న వారికి అండ
- సేవలో ముందుంటున్న మహిళలు, యువత

ప్రజానావ, ఖమ్మం: ఎవరో తెలియదు.. వారితో ఎలాంటి రక్తసంబంధం లేదు.. అయినా ఆపదలో ఉన్నారనే ఒక్క పిలుపుతో తమ రక్తాన్ని దానం చేసి మరొకరి ప్రాణాలను కాపాడుతున్నారు. నిజమైన మానవత్వానికి, నిస్వార్థ సేవకు రక్తదాతల సేవలు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఖమ్మం సర్వజనాసుపత్రి రక్తనిధి కేంద్రాన్ని పరిశీలిస్తే నిత్యం ఇలాంటి మానవీయ సంఘటనలు కనిపిస్తాయి. ఆధునిక వైద్యశాస్త్రం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ రక్తాన్ని కృత్రిమంగా తయారు చేసే సాంకేతికత అందుబాటులో లేదు. ఒకరి ప్రాణాన్ని నిలబెట్టాలంటే మరొకరు రక్తాన్ని అందించి చాల్సిందే. కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా తమ రక్తనాళాల్లోని రక్తాన్ని దానం చేస్తూ జిల్లాలో వేలాది మంది ఇతరుల ప్రాణాలను కాపాడుతున్నారు. ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులు, శస్త్రచికిత్సలు చేయించుకునే బాధితులు, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావానికి గురయ్యే బాలింతలు, తలసీమియా, లుకేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి రక్తం ఎంతో అవసరం. అయితే రక్తదానం చేస్తే నీరసం వస్తుందనే అపోహలు కొందరిలో ఇప్పటికీ ఉన్నాయి. వైద్య పరిశోధనల ప్రకారం రక్తదానం చేసిన అనంతరం దాత శరీరంలో కొత్త రక్తకణాల ఉత్పత్తి వేగంగా ప్రారంభమవుతుంది. దీంతో శరీరం నూతనోత్సాహాన్ని పొందుతుంది. క్రమం తప్పకుండా రక్తదానం చేసే వారిలో గుండెపోటు, కొన్ని రకాల క్యాన్సర్ల ముప్పు తక్కువగా ఉంటుందని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. సాధారణంగా 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయసు, కనీసం 45 నుంచి 50 కిలోల బరువు ఉన్న ఆరోగ్యవంతులైన మహిళలు, పురుషులు రక్తదానం చేయవచ్చు. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం 12.5 గ్రాముల కంటే ఎక్కువగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. పురుషులు సాధారణంగా ప్రతి మూడు నెలలకు, మహిళలు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఒక దాత నుంచి సేకరించిన రక్తాన్ని ఆర్‌బీసీ, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్‌గా వేరు చేసి ముగ్గురు రోగులకు ఉపయోగించే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా ఖమ్మం సర్వజనాసుపత్రి రక్తనిధి కేంద్రంలో రక్తదానం చేస్తున్న వారిలో మహిళల సంఖ్య పెరుగుతుండటం శుభపరిణామంగా మారింది. గతంలో శారీరక బలహీనత వస్తుందనే భయం, రక్తదానంపై ఉన్న అపోహల కారణంగా మహిళలు రక్తదానానికి దూరంగా ఉండేవారు. ప్రస్తుతం పరిస్థితుల్లో మార్పు కనిపిస్తోంది. విద్యావంతులైన యువతులు, గృహిణులు, ఉద్యోగినులు స్వచ్ఛంద రక్తదానం చేసేందుకు ముందుకు వస్తున్నారు.

ఖమ్మం అభివృద్ధికి మౌలిక సదుపాయాలే ప్రాధాన్యం

- ప్రతి డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం
- నగర పరిశుభ్రతకు ప్రజల భాగస్వామ్యం కీలకం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజానావ, ఖమ్మం: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం నగరంలోని 9, 12, 13, 14వ డివిజన్ల పరిధిలో ఉన్న మధురానగర్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగర అభివృద్ధితో పాటు ప్రజల మధ్య ఐక్యత, సౌభ్రాతృత్వం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాలకే అభివృద్ధిని పరిమితం చేయకుండా ప్రతి డివిజన్‌లోనూ అవసరమైన సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని వెల్లడించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం కేవలం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు కూడా పూర్తి స్థాయిలో సహకరించి భాగస్వాములు కావాలని సూచించారు. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు పౌరుల భాగస్వామ్యం ఉన్నప్పుడే ఖమ్మంలో సంపూర్ణ పరిశుభ్రత సాధ్యమవుతుందని అన్నారు. నగరంలో అన్ని మతాలు, కులాలకు చెందిన ప్రజలు ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేకుండా కలిసి మెలిసి, ఐకమత్యంతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్–రాయచూర్ ఇక నాలుగు వరుసల రహదారి

- 80.01 కి.మీ. మేర అత్యాధునిక రహదారి నిర్మాణం
- రూ.2,278.38 కోట్లతో పనులు
- రాకపోకలు మరింత వేగవంతం

ప్రజానావ, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్–రాయచూర్ మార్గం ఇక నాలుగు వరుసలుగా మారబోతోంది. పనులు పూర్తయితే ఈ మార్గంలో వాహనాల రాకపోకలు మరింత వేగవంతం కానున్నాయి. హైదరాబాద్–గోవా (పనాజీ) సెక్షన్‌లోని జాతీయ రహదారి–167లో మహబూబ్‌నగర్–రాయచూర్ మార్గం కీలకంగా ఉంది. ఒకప్పుడు సింగిల్ లైన్‌గా ఉన్న ఈ రహదారికి 2012లో జాతీయ హోదా కల్పించి, 100 అడుగుల విస్తీర్ణంతో రెండు వరుసలుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో 2013–2015 మధ్య జడ్చర్ల నుంచి మహబూబ్‌నగర్ మీదుగా రాయచూర్ వరకు రెండు వరుసల రహదారిని నిర్మించారు. ప్రస్తుతం ఈ మార్గంలో వాహనాల రద్దీ రోజురోజుకూ పెరుగుతుండటంతోపాటు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నాలుగు వరుసలుగా విస్తరించేందుకు చర్యలు చేపట్టింది. ఈ ఏడాది రూ.2,500 కోట్లు విడుదల చేసి, రూ.2,278.38 కోట్లకు టెండర్ నిర్వహించి ఓ సంస్థకు పనుల బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం 200 అడుగుల విస్తీర్ణంతో అత్యాధునిక పద్ధతుల్లో రహదారిని నిర్మించనున్నారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల పరిధిలో పొలాలు, ఇళ్లు కోల్పోయిన 850 మంది నిర్వాసితులకు రూ.123 కోట్ల పరిహారం చెల్లించారు. హైదరాబాద్ నుంచి గోవాకు వెళ్లేందుకు ఉన్న మూడు ప్రధాన మార్గాల్లో మహబూబ్‌నగర్–రాయచూర్ మార్గాన్నే పర్యాటకులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. గోవాతోపాటు గోకర్ణ, మురుడేశ్వర్, హుబ్లీ, విజయపుర ప్రాంతాలకు వెళ్లే వారు సైతం ఈ మార్గంలోనే ప్రయాణిస్తున్నారు. రహదారి విస్తరణలో భాగంగా మహబూబ్‌నగర్‌లోని పీయూ నుంచి మన్యంకొండ, దేవరకద్ర, మరికల్, జక్లేర్, మక్తల్, మాగనూరు మీదుగా కర్ణాటకలోని గూడెబల్లూరు వరకు 80.01 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారిని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రెండు వరుసల రహదారి మధ్యలో (ప్రతి 20 మీటర్లకు ఒకచోట ప్రతిపాదిత మధ్య రేఖ (పీసీఎల్) గుర్తులు వేస్తూ ఇరువైపులా ఉన్న ముళ్లచెట్లు, పొదలను తొలగిస్తున్నారు. బాగ్‌మార్‌సాబ్ మలుపు నుంచి దేవరకద్ర వరకు, దేవరకద్ర నుంచి మరికల్ వరకు ఈ పనులు దాదాపు పూర్తయ్యాయి. మరికల్ నుంచి మాగనూరు మధ్య పలుచోట్ల మట్టి తవ్వి, కంకర పరిచే పనులను ప్రారంభించారు. రహదారి నిర్మాణాన్ని వేగవంతం చేసి 2027 చివరి నాటికి నాలుగు వరుసల రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. పనులు పూర్తయితే హైదరాబాద్–గోవా రాకపోకలు మరింత సులభతరం కావడంతోపాటు మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.

వేములవాడలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

ప్రజానావ, వేములవాడ: వేములవాడ పట్టణంలోని మూలవాగు బతుకమ్మ తెప్ప వద్ద ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కమీషనర్ లోకేష్, వైస్ చైర్మన్ నరాల శేఖర్, నాయకులు ప్రతాప రామకృష్ణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తరపున పట్టణ ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. బతుకమ్మ ఆడే ప్రదేశాలు, నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్యం, లైటింగ్, ఇతర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే కౌన్సిలర్లు, అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పోలీస్ స్టేషన్‌లో సీనియర్ సిటిజన్ వాలంటరీ కమిటీ ఏర్పాటు చేయాలి

జిల్లా ఎస్పీకి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వినతి

ప్రజానావ, సిరిసిల్ల : ప్రతి పోలీస్ స్టేషన్ సీనియర్ సిటిజన్ వాలంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి చేసింది ఈ మేరకు శనివారం అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జనపాల శంకరయ్య, జిల్లా అధ్యక్షులు చేపూరి బుచ్చయ్య, కోడం నారాయణ ల ఆధ్వర్యంలో కార్యవర్గం ఎస్పీకి వినతి పత్రం సమర్పించారు. ప్రతి మండలంలో సీనియర్ సిటిజన్ వాలంటరీ కమిటీ ఏర్పాటుచేస్తే వేధింపులకు గురవుతున్న తల్లిదండ్రుల కేసులు సత్వరమే పరిష్కారమవుతాయని ఆకాంక్షించారు. తమ కమిటీ సీనియర్ సిటిజన్స్ కౌన్సిలింగ్ ద్వారా ఒక కొలిక్కితేగలుగుతామని తర్వాత మీ ముందుంచి తీర్మానం చేయడం జరుగుతుందని సీనియర్ సిటిజన్స్ వివరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి దొంత దేవదాసు, కార్యదర్శులు గౌరిశెట్టి ఆనందం, అంకారపు జ్ఞానోభ లు పాల్గొన్నారు.

రాజీవ్ నగర్‌లో ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలు

మహిళలతో కలిసి ఆటపాటల్లో సందడి చేసిన కందుల సంధ్యారాణి

ప్రజానావ, పెద్దపల్లి: రాజీవ్ నగర్‌లో లక్ష్మీ నగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ ఆధ్వర్యంలో వల్స సుజాత నివాసంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి బతుకమ్మను పేర్చి, ఆటపాటల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, మహిళల్లో ఐక్యత, ఆత్మీయతను పెంపొందిస్తుందన్నారు. సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు వాటి విశిష్టతను తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో విజయ, తిరుమల, కనకలక్ష్మి, లచ్చమ్మ, కళావతి, మహేశ్వరి, శ్యామల, పద్మ, సాయిప్రియ, సరిత, కవిత, పావని, శ్వేత, భాగ్య, సంజన, రమ్య, శారద, శాన్వి, యశస్విని, శాన్విక తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వర స్వామిని దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్

ప్రజానావ, వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధాలయమైన శ్రీ భీమేశ్వర స్వామిని దేవాదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ హనుమంతరావు కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేసి ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ ఉద్యోగులతో సమావేశమైన కమిషనర్.. రానున్న దసరా, సద్దుల బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

భీమేశ్వర ఆలయంలో నేటి నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు

అక్టోబర్ 11 నుంచి 20 వరకు ప్రత్యేక పూజలు

ఉభయదాతలకు టికెట్ ధర రూ.5,000

ప్రజానావ, వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ ప్రత్యేక కుంకుమ పూజల్లో పాల్గొనే ఉభయ దాతలకు టికెట్ ధర రూ.5,000గా నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని భీమేశ్వర స్వామి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ పీఆర్వో పెరిక శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు.

నేడు రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భావ దశాబ్ది కవి సమ్మేళనం

కవులు, రచయితలు, సాహితీ అభిమానులు పాల్గొనాలని పిలుపు

ప్రజానావ, సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంలో భాగంగా కవి సమ్మేళనం ఏర్పాటు చేయడం జరిగిందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భావ దశాబ్ది కమిటీ ప్రకటించింది. ఈ మేరకు "రాజన్న సిరిసిల్ల జిల్లా వైభవం – నాడు నేడు అనే అంశంపై జిల్లా ఆవిర్భావం నుంచి నేటి వరకు సాగిన పదేళ్ల ప్రస్థానాన్ని, జిల్లా చారిత్రక, సాంస్కృతిక, సాహిత్య, కళా, చేనేత అలాగే అభివృద్ధి వైభవాన్ని కవులు తమ కవితా గానంతో ఆవిష్కరించాలని కోరారు. ఈనెల 11న ఆదివారం ఉదయం ఉదయం 10:00 గంటలకు కలెక్టర్ కార్యాలయం దగ్గర సిరిసిల్ల తెలంగాణ భవన్, ఫంక్షన్ హాల్ లో కవి సమ్మేళనం జరుగుతుందని తెలిపారు. కవులు, రచయితలు, సాహితీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కవి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భావ దశాబ్ది కమిటీ వెంగళ లక్ష్మణ్, ఆడెపు లక్ష్మణ్, అంకారాపు రవి లు కోరారు.

ఉపాధి హామీ కల్పనలో.. రాష్ట్రంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఫస్ట్

- **శాశ్వత ఆస్తుల నిర్మాణంలో బెస్ట్**
- **సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణ**
- **ప్రణాళిక ప్రకారం జిల్లాలో వీబీజీ రామ్ జీ పనులు**
- **జిల్లాలో జూలై నుంచి ఇప్పటివరకు 4,02,360 పని దినాల కల్పన**

ప్రజానావ, సిరిసిల్ల : వీబీజీరామ్ జీ కింద ఉపాధి హామీ పనులు కల్పనలో రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రంలో ముందు స్థానంలో నిలిచింది. జిల్లా యంత్రాంగాన్ని రాష్ట్ర అధికార యంత్రాంగం అభినందించింది. శాశ్వత ఆస్తుల కల్పన.. పనరుల సంరక్షణ పనులు చేయిస్తూ జిల్లా అధికార యంత్రంగా ముందుకు సాగుతోంది.

విస్తృతంగా ఉపాధి హామీ పనులు

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వికసిత్ భారత్–గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్(వీబీజీరామ్ జీ) కార్యక్రమం కింద పనులను విస్తృతంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు ఉపాధి పనులపై జిల్లాలోని ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా పనులు గుర్తించి.. చేయిస్తున్నారు.

మరింత పెంచేందుకు చర్యలు

జిల్లాలో మొత్తం 260 గ్రామ పంచాయతీలు ఉండగా, మొత్తం 98 వేల జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రతి రోజు 32, 148 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఈ సంఖ్యను మరింత పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నుంచి అక్టోబర్ 09వ తేదీ వరకు 4,02,360 పని దినాలు కల్పించడం జరిగింది.

రాష్ట్ర స్థాయి అధికారుల అభినందన

జిల్లాలో ఒక్కో గ్రామ పంచాయతీ నుంచి సగటున 45 మంది కూలీలు ఉపాగి పనులకు హాజరవుతున్నారు. ఈ సంఖ్య రాష్ట్రంలోనే అత్యధికం. ఉపాధి కల్పనలో ముందున్న జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులను రాష్ట్ర స్థాయి అధికారులు అభినందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఉపాధి హామీ కింద వేతనాలకు రూ.12 కోట్ల 90 లక్షలు ఇవ్వగా, మెటీరియల్ కోసం 76 లక్షల రూపాయలు కేటాయించారు. మెటీరియల్ కోసం ఇంకా 7 కోట్ల 37 లక్షల ఖర్చు చేయాల్సి ఉంది.

కూలీలకు పని కల్పించేలా ప్రణాళిక

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో వీబీ జీ రామ్ జీ కింద కూలీలకు పనులు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశాము. ఇందులో భాగంగా ఇప్పటికే సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు తమ ప్రాంతంలో అనువైన పనులు చేయించడంపై శిక్షణ ఇప్పించాం. పనులకు కూలీలు భారీ సంఖ్యలో వస్తున్నారు. రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం చాలా సంతోషం. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్తాం.

– గరిమ అగ్రవాల్, జిల్లా కలెక్టర్

17 నుంచి సిరిసిల్లలో.. వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

- **21న కళ్యాణం, 26న రథోత్సవం జాతర ఉత్సవాలు**
- **ప్రభుత్వ శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు**

ప్రజానావ, సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 17 నుండి ఘనంగా ప్రారంభం అవుతున్నాయి. ఈ మేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో పోలీసు, మున్సిపల్ తదితర శాఖల సమన్వయంతో జాతర, రథోత్సవ వేడుకల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా పరాభవ నామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ సప్తమి అక్టోబర్ 17 నుండి 28 వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలలో ప్రధాన ఉత్సవాలు అక్టోబర్ 20న విజయదశమి వేడుకలలో భాగంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి అశ్వ వాహనంపై (శమీ దర్శనం) ఊరేగింపు జరిగి భక్తులకు, ప్రజలకు దర్శనమిస్తారు. అలాగే 21న స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 23న శ్రీ అండాలమ్మ వారికి ఓడి బియ్యం సమర్పించే కార్యక్రమం జరుగుతుంది. 25న స్వామి వారు పొన్న వాహన సేవపై ఊరేగుతారు. బ్రహ్మోత్సవాలలో అతి ముఖ్యమైన వేడుక అక్టోబర్ 26న రథోత్సవం, జాతర ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. బ్రహ్మోత్సవాల మిగితా రోజులలో ఈనెల 17న ఉదయం నుండి ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. 18న స్వామి వారు శేష వాహనంపై, 19న హంస వాహనంపై, సింహ వాహనంతో పాటు అశ్వవాహనంపై, 21న సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతారు. ఇదే రోజు ఎదుర్కోలు, కళ్యాణోత్సవం జరుగుతుంది. 22న గరుడ, హనుమంత వాహనాలపై స్వామి ఊరేగింపు జరుగుతుంది. 23న అండాలమ్మ వారికి ఓడిబియ్యం సమర్పణ, గజవాహనంపై స్వామివారి ఊరేగింపు సాగుతుంది. 24న కాళీయమర్దనం పై ఊరేగింపు, 25న రంగనాయక తిరుప్పోలం అలంకరణతో అలాగే పొన్నవాహనంపై శ్రీవారి ఊరేగింపు జరుగుతుంది. 26న రథంపై ప్రజలకు శ్రీవారి దర్శనాలు జరుగుతాయి. ఇదే రోజు సాయంత్రం ఐదు గంటలకు రథంపై స్వామివారి ఊరేగింపు, జాతర అనంతరం రాత్రి అశ్వాహనంపై శ్రీవారి ఊరేగింపు దోపుకథ జరుగుతుంది. 27న చక్రస్నానం, అనంతరం స్వామి వారి ఏకాంత సేవతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈవో డివి మారుతీ రావు వెల్లడించారు.

ప్రజాస్వామ్యాన్ని అణచివేయలేరు.. ఉద్యమాలను ఆపలేరు

- **ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి: కే. రాజన్న**

ప్రజానావ, పెద్దపల్లి : దేశంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ న్యూడె మోక్రసీ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కే. రాజన్న పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ నిర్బంధ చర్యలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువజనులు, ప్రజాస్వామికవాదులు ఢిల్లీ తరహా ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఢిల్లీలో నిరసనలను అడ్డుకునేందుకు ఆంక్షలు విధించడం ప్రజల నిరసన తెలిపే హక్కును హరించడమేనని రాజన్న విమర్శించారు. ఎన్ని నిర్బంధాలు విధించినా ప్రజా ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని, ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులు, స్వేచ్ఛాయుత ఎన్నికల పరిరక్షణ కోసం పోరాటాలను కొనసాగిస్తామని కే. రాజన్న పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో డబ్బులు వసూలు చేస్తే సహించేది లేదు

- **దళారులను నమ్మి మోసపోవద్దు**
- **అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం**
- **ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**

ప్రజానావ, కుభీర్: ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామంటూ కొందరు దళారులు ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. ఇళ్ల కోసం దళారులను నమ్మి డబ్బులు చెల్లించి మోసపోవద్దని లబ్ధిదారులకు సూచించారు. అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలో గురువారం భవిత కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాసంస్థలను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న గ్రామైక్య సంఘం భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి మాట్లాడారు. ఇళ్ల మంజూరు విషయంలో అర్హులైన వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూ రయ్యేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కందూరి సాయినాథ్, ఎంపీడీవో భూమారావు, ఏపీవో హరిలాల్, ఐకేపీ ఏపీఎం దత్తాత్రి, భూమన్న, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సట్ల గంగాధర్, నాయకులు ఏశాల దత్తాత్రి, విట్టల్, మోహన్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు తోకల మారుతి, పలువురు సర్పంచులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

డెయిరీ అభివృద్ధికి రూ.1.85 కోట్ల నిధులు

- **తొలి విడతలో రూ.89.50 లక్షల మంజూరు**
- **ఆధునికీకరణ పనులతో మౌలిక వసతుల మెరుగుదల**
- **పాల సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు**

ప్రజానావ, హనుమకొండ: వరంగల్ పరిధిలోని విజయ తెలంగాణ డెయిరీ అభివృద్ధి, మరమ్మతులు, మౌలిక వసతుల మెరుగుదల కోసం రూ.1.85 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ఉపసంచాలకుడు గంగాధారి ధనరాజ్ తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను అందించడంతోపాటు పాడి రైతులకు మెరుగైన సేవలు కల్పించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ కె. చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ చహత్ బాజ్‌పాయ్‌కు నివేదిక సమర్పించామని, అనంతరం నిధుల మంజూరుకు ఉత్తర్వులు జారీ అయ్యాయని వివరించారు. డెయిరీ అభివృద్ధి పనుల్లో భాగంగా తొలి విడతలో రూ.89.50 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు ధనరాజ్ పేర్కొన్నారు. విజయ తెలంగాణ డెయిరీని ఆధునికీకరించి, మౌలిక వసతులను బలోపేతం చేయడం ద్వారా పాల సేకరణ, ప్రాసెసింగ్, పంపిణీ సేవలను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆధునికీకరణ పనుల నేపథ్యంలో డెయిరీ ప్రధాన కార్యాలయం ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా లోని వరంగల్ డెయిరీలో ప్యాకింగ్ కార్యకలాపాలను 10వ తేదీ నుంచి తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. అయితే వినియోగదారులకు పాలు, పాల ఉత్పత్తులు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా రావిర్యాలలోని మెగా డెయిరీ నుంచి పాలు, పాల ఉత్పత్తులను తీసుకొచ్చి గ్రేటర్ వరంగల్ పరిధిలోని వినియోగదారులకు అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ తాత్కాలిక మార్పులకు సహకరించాలని పాల పంపిణీదారులు, ఏజెంట్లు, విక్రయదారులు, వినియోగదారులు, పాడి రైతులకు ధనరాజ్ విజ్ఞప్తి చేశారు. విజయ తెలంగాణ డెయిరీ అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం అందిస్తున్న సహకారంతో డెయిరీ అభివృద్ధి, పాడి రైతుల ప్రయోజనాల పరిరక్షణ, వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తుల సరఫరా, సంస్థ పురోగతికి అవసరమైన చర్యలను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

పోలీసులపై గ్రామస్థుల దాడి

- **నలుగురికి గాయాలు**
- **గంజాయి కేసు విచారణకు వెళ్లిన పోలీసులపై దాడి**

ప్రజానావ, ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాలో పోలీసులపై గ్రామస్థులు దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. సిరికొండ మండలం వాయిపేట గ్రామంలో గంజాయి కేసు విచారణ నిమిత్తం వెళ్లిన పోలీసులపై స్థానికులు మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ ఘటనలో ఇచ్చోడ రూరల్ సీఐ, ఏఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. గంజాయి కేసులో అరెస్టయిన ఓ వ్యక్తికి సంబంధించిన విచారణ కోసం పోలీసులు గ్రామానికి వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఒక్కసారిగా పలువురు గ్రామస్థులు పోలీసులపై దాడి చేసినట్లు తెలిసింది. దాడిలో పోలీసు వాహనం అద్దాలతో పాటు ఫోన్లను కూడా ధ్వంసం చేసినట్లు సమాచారం. ఘటనలో గాయపడిన పోలీసులను చికిత్స నిమిత్తం ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఘనంగా బతుకమ్మ సంబురాలు

ప్రజానావ, నిజామాబాద్: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో బతుకమ్మలను తీసుకువచ్చి సంప్రదాయబద్ధంగా వేడుకలు జరుపుకున్నారు. తంగేడు పువ్వులతో పాటు వివిధ రకాల రంగురంగుల పూలను ఉపయోగించి అందంగా బతుకమ్మలను పేర్చారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో సంప్రదాయానికి ప్రతీకగా ముగ్గులు వేసి, వాటి మధ్యలో బతుకమ్మలను ఉంచారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత మారయ్య గౌడ్, కరస్పాండెంట్ హరిత గౌడ్, డైరెక్టర్ హర్షిత్ గౌడ్, ప్రిన్సిపాల్ రాజేందర్ గౌడ్, అరుణ్, ఉపాధ్యాయులు డాక్టర్ తక్షశిల వేణుగోపాల్‌తో పాటు అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

సమతుల్యమైన వ్యాపారం సంతృప్తికరమైన జీవితం

ప్రజానావ, కరీంనగర్ : ఆధునిక సమాజంలో మానసిక ఒత్తిళ్లను అధిగమించి ప్రశాంతమైన జీవితాన్ని గడిపినప్పుడే వృత్తి, వ్యాపార రంగాల్లో రాణిం చగలమని బ్రహ్మకుమారీస్ స్థానిక సేవా కేంద్రం నిర్వాహ కులు బీకే విజయలక్ష్మి, బీకే మనీషా, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టిమల్ల శ్రీనివాస్ అన్నారు. బ్రహ్మకుమారీస్ రాజయోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ సౌజన్యంతో ఆదివారం కరీంనగర్ కిసాన్ నగర్‌లోని మైత్రి కన్వెన్షన్‌లో 'సమతుల్యమైన వ్యాపారం – సంతృప్తికరమైన జీవితం' అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ కోలగాని శ్రీనివాస్ పాల్గొని మార్గదర్శనం చేయనున్నట్లు వెల్లడించారు.

బతుకమ్మ ఘాట్ల వద్ద అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలి

ప్రజానావ, సిరిసిల్ల: బతుకమ్మ నిమజ్జన ఘాట్ల వద్ద పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి ఆదేశించారు. శనివారం సిరిసిల్ల పట్టణం, విలీన గ్రామాల్లోని బతుకమ్మ ఘాట్ల వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను కౌన్సిలర్లతో కలిసి ఆమె పరిశీలించారు. మహిళలు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ ఏడాది వివిధ వార్డుల్లో రూ.32 లక్షలతో నూతన బతుకమ్మ ఘాట్లు నిర్మిస్తుండగా, ఘాట్ల వద్ద ఇతర ఏర్పాట్లకు రూ.29.50 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖాదిర్ ఫాషా, విప్ బుర్ర

మల్లికార్జున్, కౌన్సిలర్లు బింగి రాంబాబు, ఆడెపు చంద్రకళ ప్రభాకర్, మామిడాల మహేష్, ఏఈ నరసింహస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



షాపింగ్ మాల్ పైకప్పు కూలి 38 మందికి గాయాలు

- డేగూ నగరంలో ఘటన
- 66 మందిని సురక్షితంగా బయటకు తరలించిన సహాయక బృందాలు

సియోల్: దక్షిణ కొరియాలోని డేగూ నగరంలో ఓ షాపింగ్ మాల్‌లో పైకప్పు కూలిన ఘటనలో సుమారు 38 మంది గాయపడ్డారు. నాలుగు అంతస్తుల భవనంలోని రెండో అంతస్తులో ప్లాస్టర్ సీలింగ్ కూలిపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటన జరిగిన వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి, ప్రమాదంలో చిక్కుకున్న 66 మందిని సురక్షితంగా బయటకు తరలించినట్లు డేగూ అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు. ఉదయం 10.16 గంటలకు ఈ ఘటన జరిగినట్లు తెలిపారు. గాయపడిన వారిలో కొందరు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఎవరూ తీవ్రంగా గాయపడలేదని పేర్కొన్నారు. నాలుగు అంతస్తుల భవనంలోని రెండో అంతస్తు పైకప్పుకు వేసిన ప్లాస్టర్ కూలిపోయిందని అగ్నిమాపక శాఖ అధికారి యూన్ జూంగ్ మి వివరించారు. అయితే, పైకప్పు కూలడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, ఘటనపై సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. మరోవైపు, ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మయుంగ్ అధికారులను ఆదేశించారు. బాధితులకు అవసరమైన చికిత్స అందించడంతో పాటు, ప్రమాదానికి గల కారణాలను గుర్తించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

ఢిల్లీలో యుద్ధ సన్నద్ధత తరహా భద్రతా ఏర్పాట్లు

- ప్రకాశ్ అంబేద్కర్
- చెక్‌పోస్టులు, కాంక్రీట్ బారికేడ్లు, ముళ్ల కంచెలపై అభ్యంతరం
- సీజేపీ నిరసనకు వీబీఏ అధ్యక్షుడి సంపూర్ణ మద్దతు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలను అడ్డుకునేందుకు చేపట్టిన భద్రతా ఏర్పాట్లపై వంచిత్ బహుజన్ అఘాడీ (వీబీఏ) అధ్యక్షుడు ప్రకాశ్ అంబేద్కర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నగరంలో యుద్ధ సన్నద్ధతను తలపించేలా భద్రతా బలగాలను మోహరించారని విమర్శించారు. 250కు పైగా రైళ్లు, 45 మెట్రో సర్వీసులను రద్దు చేయడంపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి రెండు గంటలకు ఢిల్లీకి చేరుకున్నప్పుడు గతంలో ఎన్నడూ చూడని పరిస్థితులు కనిపించాయని పేర్కొన్నారు. ప్రతి వంద మీటర్లకు ఒక చెక్‌పోస్టు, కాంక్రీట్ అడ్డంకులు, ముళ్ల కంచెలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు సరైనవి కావని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, సీజేపీ చేపట్టిన నిరసనకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనుమడు ప్రకాశ్ అంబేద్కర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నిరసనలను అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ప్రజాస్వామ్య హక్కులకు ముప్పుగా పరిణమిస్తోందని ఆరోపించారు. ఎమర్జెన్సీ సమయంలోనూ ఇలాంటి అణచివేతను చూడలేదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తనను జైలుకు పంపినా పోరాటాన్ని ఆపవద్దని నిరసనకారులకు పిలుపునిచ్చారు.

సౌదీ విమానాశ్రయంపై మరోసారి దాడి

- నిలిచిన విమాన సర్వీసులు
- పేలుడు ఘటనలో పలువురికి గాయాలు
- నాలుగు గంటల తర్వాత పునఃప్రారంభమైన రాకపోకలు
- ప్రయాణికులకు ఎయిర్‌పోర్టు అధికారుల సూచనలు

రియాద్ : సౌదీ అరేబియాలోని విమానాశ్రయంపై జరిగిన దాడిలో పలువురు గాయపడ్డారు. భద్రతా కారణాల దృష్ట్యా బాధితుల పేర్లను అధికారులు వెల్లడించలేదు. పేలుడు శబ్దం వినిపించిన వెంటనే అప్రమత్తమైన అధికారులు విమానాశ్రయాన్ని ఖాళీ చేయించారు. సహాయక చర్యల కోసం 12 అంబులెన్సులను ఘటనా స్థలానికి తరలించారు. అధికారులు తక్షణమే సహాయక చర్యలు చేపట్టి, విమాన సర్వీసులను నిలిపివేశారు. ప్రయాణికులు విమానాశ్రయానికి బయలుదేరే ముందు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించి, తమ విమానాల రాకపోకల వివరాలను తెలుసుకోవాలని ఎయిర్ పోర్టు అధికారులు సూచించారు. ఈ మేరకు అడ్వైజరీ జారీ చేశారు. దాదాపు నాలుగు గంటల అనంతరం విమానాల రాకపోకలను తిరిగి ప్రారంభించారు. కాగా, వారంలోనే ఈ విమానాశ్రయంపై రెండుసార్లు దాడులు జరగడం ఆందోళన కలిగిస్తోంది. హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో తాజా ఘటన చోటుచేసుకుంది.

విమానంలోనే సీజేపీ నేతల అరెస్ట్

- మహిళా పోలీసులతో ఆపరేషన్

న్యూఢిల్లీ: సీజేపీ అధ్యక్షుడు అభిజీత్ దీప్కేను అరెస్టు చేసే క్రమంలో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ముంబై నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా విమానం ఢిల్లీ ఐజీఐ విమానాశ్రయంలో దిగిన వెంటనే, ప్రయాణికులందరూ పూర్తిగా విమానం నుంచి దిగకముందే పోలీసులు లోపలికి ప్రవేశించారు. ఈ పరిణామాలను ముందుగానే ఊహించిన దీప్కే, తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ క్రమంలో సీజేపీ నేతలు అభిజీత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ అరెస్టుల కోసం ఢిల్లీ పోలీసులు మహిళా పోలీసు అధికారులను విమానంలోకి పంపడం చర్చనీయాంశమైంది.

అంబానీపై మస్క్ విమర్శలు తీవ్రం

రాజకీయ విరాళాల కథనాలు షేర్

న్యూఢిల్లీ: రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీని లక్ష్యంగా చేసుకుని టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ తన విమర్శలను మరింత తీవ్రతరం చేశారు. శనివారం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పలు వార్తా కథనాలకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లను ఆయన పంచుకున్నారు. బీజేపీకి నిధులు సమకూర్చిన రిలయన్స్ సంస్థలు సోషల్ మీడియాలో ప్రచారం చేశాయన్న కథనాలతో పాటు, రిలయన్స్ అనుబంధ సంస్థ రాజకీయ పార్టీలకు భారీగా విరాళాలు ఇచ్చిందన్న నివేదికలను తన పోస్టులో ప్రస్తావించారు. 2024లో 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ప్రచురించిన ఓ కథనాన్ని మస్క్ షేర్ చేశారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీకి రూ.385 కోట్లు, శివసేనకు రూ.25 కోట్ల విరాళంగా ఇచ్చినట్లు పేర్కొన్న క్విక్ సప్లై సంస్థకు సంబంధించిన వివరాలను ఆ కథనం ప్రస్తావించింది. మరోవైపు, దేశంలో టెలికం, ఉపగ్రహ సేవలకు అనుమతులు మంజూరు చేసే ప్రక్రియ పూర్తిగా న్యాయబద్ధంగా, వివక్షకు తావులేకుండా సాగుతోందని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విషయంలో ఏ సంస్థపైనా పక్షపాతం చూపుతున్నారన్న ఆరోపణలను నిరాధారమైనవిగా కొట్టిపారేసింది. ఇదిలా ఉండగా, ఈ వారం ఢిల్లీలో జరిగిన 'ఇండియా మొబైల్ కాంగ్రెస్' సదస్సులో రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ ఈ వివాదంపై స్పందించేందుకు నిరాకరించారు.

పనామాలో భారీ భూకంపం

- 7.6 తీవ్రతతో ప్రకంపనలు
- పసిఫిక్ తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు
- ఆ తర్వాత ఉపసంహరణ
- భవనాలకు నష్టం.. పలువురికి గాయాలు

పనామా: ఉత్తర, దక్షిణ అమెరికాల మధ్య ఉన్న పనామా దేశంలో శుక్రవారం భారీ భూకంపం సంభవించింది. దక్షిణ తీర ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 7.6 తీవ్రతతో భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. భూకంపం నేపథ్యం లో అధికారులు తొలుత పసిఫిక్ తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. అయితే పరిస్థితిని సమీక్షించిన అనంతరం పెద్దగా సునామీ ముప్పు లేదని నిర్ధారించి హెచ్చరికలను ఉపసంహరించు కున్నారు. అమెరికా భూగర్భ సర్వే సంస్థ (యూఎస్‌జీఎస్) సమాచారం ప్రకారం.. పనామా లోని పిటలోజా అరిబా సమీపంలో భూమికి సుమారు 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. తొలుత భూకంప తీవ్రతను 8.0గా అంచనా వేసిన అధికారులు, అనంతరం దానిని 7.6గా సవరించారు. ప్రకంపనల ధాటికి పనామా నగరంలోని భవనాలు కంపించగా, పొరుగున ఉన్న కోస్టారికా రాజధానిలోనూ భూమి కదిలింది. దీంతో భయాందోళనలకు గురైన ప్రజలు ఇళ్లు, కార్యాల యాల నుంచి బయటకు పరుగులు తీశారు. పెనోనోమే నగరంలో ఓ కేథడ్రల్ టవర్ కూలి పోయినట్లు, మరికొన్ని నిర్మాణాలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక నివేదికలు వెల్లడించాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భూకంపం సంభవించిన వెంటనే అమెరికా సునామీ హెచ్చరికల వ్యవస్థ పనామా, కొలంబియా, ఈక్వడార్ సహా మధ్య అమెరికాలోని పసిఫిక్ తీర ప్రాంతాలకు హెచ్చరికలు జారీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో ఒకటి నుంచి మూడు మీటర్ల ఎత్తు వరకు అలలు ఎగిసిపడే అవకాశం ఉందని అంచనా వేసింది. అయితే పరిస్థితిని పరిశీలించిన పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం, పెద్ద సునామీ ముప్పు లేదని ప్రకటించడంతో హెచ్చరికలను ఎత్తివేశారు. ప్రధాన భూకంపం తర్వాత కూడా ప్రకంపనలు కొనసాగాయి. 6.6 తీవ్రతతో మరోసారి భూమి కంపించడంతో పాటు పలుమార్లు స్వల్ప ప్రకంపనలు సంభవించాయి. ఈ ఘటనలో ప్రాణనష్టానికి సంబంధించి వెంటనే పూర్తి వివరాలు వెల్లడికాలేదు. కొందరు గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ప్రజలు సంయమనం పాటించాలని, అప్రమత్తంగా ఉండాలని పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ములినో విజ్ఞప్తి చేశారు. మరోవైపు, భూకంపం ప్రభావంతో పనామా కాలువ కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం కలగలేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం భూకంపం కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసే పనిలో సంబంధిత యంత్రాంగం నిమగ్నమైంది.

మైనర్ బాలికలపై వేధింపులు

- భారతీయుడికి 20 ఏళ్ల జైలు
- ఆన్‌లైన్ గ్రూపు ద్వారా బాలికలను వేధించిన రోహన్ రాణే
- ఆరుగురి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన వ్యవహారం

పారిస్: మైనర్ బాలికలను వేధిస్తూ, వారి వ్యక్తిగత వీడియోలను ఆన్‌లైన్‌లో ప్రచారం చేసిన కేసులో భారతీయుడు రోహన్ రాణేకు పారిస్ కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 29 ఏళ్ల రోహన్ రాణే బాలికలను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడటంతో పాటు, కొన్ని సందర్భాల్లో వారిని చిత్రహింసలకు గురిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుడు నయా నాజీ భావజాలానికి మద్దతుదారుడిగా వ్యవహరించాడని, పురు షాధిక్య హింసకు పాల్పడ్డాడని ప్రాసిక్యూటర్లు కోర్టుకు వివరించారు. అతను నిర్వహించిన ఆన్‌లైన్ గ్రూపులో ఎక్కువ మంది అమెరికాకు చెందిన బాలికలు ఉండగా, బాధితుల్లో అధికశాతం మంది 15 ఏళ్లలోపు వారేనని గుర్తించారు. అమెరికా, భారత్, జర్మనీ, న్యూజిలాండ్‌కు చెందిన పురుషుల తోనూ అతను ఆన్‌లైన్ గ్రూపును నిర్వహించినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. ఈ వ్యవహారం లో ఆరుగురు బాలికలు ఫిర్యాదు చేయగా, మరో 20 మంది బాధితులను అధికారులు గుర్తించారు. వ్యవస్థీకృత నేరాలకు పాల్పడిన రోహన్ రాణే బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు కోర్టు పేర్కొంది. సీవీఎల్‌టీ గ్రూపు పేరుతో బాలికలను ఆకర్షించి, వారి బలహీనతలను ఆసరాగా చేసుకుని వేధింపులకు పాల్పడినట్లు ప్రాసిక్యూటర్లు వెల్లడించారు. కోవిడ్–19 మహమ్మారి సమయంలో ఈ గ్రూపు మరింత చురుగ్గా మారినట్లు తెలిపారు. చదువుకునేందుకు ఫ్రాన్స్‌కు వెళ్లిన రోహన్ రాణే, మానసికంగా కుంగిపోయిన బాలికలను ఆన్‌లైన్‌లో పరిచయం చేసుకుని వారి నుంచి నగ్న చిత్రాలను సేకరించే వాడని ఆరోపించారు. తన డిమాండ్లను అంగీకరించకపోతే వారి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు వ్యక్తిగత చిత్రాలను పంపిస్తానంటూ బెదిరించేవా డని పేర్కొన్నారు. బాధితుల్లో నల్లజాతి, యూదు బాలికలు ఎక్కువగా ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు. తన లైంగిక కోరికలు తీర్చుకోవాలని ఒత్తిడి చేయడంతో పాటు, కత్తితో శరీరంపై కోసుకోవాలని ప్రేరే పించేవాడని ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా, శరీరంపై నాజీ స్వస్తిక్ గుర్తును ముద్రించు కునేలా కూడా ఒత్తిడి చేసినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారానికి సంబంధించి 2012లోనే రోహన్ రాణేను ఫ్రాన్స్‌లో తొలిసారిగా అరెస్టు చేసినట్లు సమాచారం. సీవీఎల్‌టీ గ్రూపు కార్యకలాపాల గురించి అమెరికా అధికారులు తొలుత ఫ్రాన్స్ అధికారులకు సమాచారం అందించారు. 12 ఏళ్ల బాలిక శరీరంపై 'రోహన్' అని రాసి ఉన్న ఫొటోలు అమెరికా పోలీసులకు లభించడంతో ఈ కేసుపై దర్యాప్తు ముమ్మరం చేశారు. బాధితులు, సాక్షులకు బెదిరింపులు రావడంతో అధికారులు కేసును తీవ్రంగా పరిగణించారు. రోహన్ రాణేను తమకు అప్పగించాలని అమెరికా ప్రభుత్వం ఫ్రాన్స్‌ను కోరినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో బ్రిటన్, కెనడాకు చెందిన బాధితులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

'సర్'పై సుప్రీంకోర్టు తీర్పును వెనక్కి తీసుకోవాలి

- ఎన్నికల సంఘం కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చింది
- మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి. గోపాల గౌడ
- అంతర్గత విభేదాలను దాచిపెట్టారని ఆరోపణ

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) నిర్వహణకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్ణయాలను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి. గోపాల గౌడ డిమాండ్ చేశారు. ఈ అంశంపై విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం తప్పుడు సమాచారాన్ని అందించి న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించిందని ఆయన ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పులో రాజ్యాంగ విరుద్ధత స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ప్రచురించిన కథనాన్ని ప్రస్తావిస్తూ, సర్ ప్రక్రియకు సంబంధించిన పలు నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని గోపాల గౌడ తెలిపారు. ఎన్నికల సంఘంలో నెలకొన్న ఈ అంతర్గత విభేదాల గురించి సుప్రీం కోర్టుకు ఉద్దేశపూర్వకంగా సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టారని ఆరోపించారు. విచారణ సమయంలో కీలకమైన అంశాలను వెల్లడించకపోవడం న్యాయస్థానాన్ని మోసగించడమే అవుతుందని అభిప్రాయ పడ్డారు. ఈ పరిణామాలు తీర్పునకు ఆధారమైన అంశాల విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయని పేర్కొంటూ, సుప్రీంకోర్టు తన తీర్పును పునఃపరిశీలించి వెనక్కి తీసుకోవాలని జస్టిస్ వి. గోపాల గౌడ కోరారు.

అయోధ్య నుంచి అఖిలేశ్ పోటీకి సిద్ధమైతే.. నేనూ రెడీ: యోగి

- అఖిలేశ్‌కు యూపీ సీఎం సవాల్
- ఇద్దరి మధ్య నేరుగా పోటీ జరగాలని షరతు
- ఎస్పీది కుటుంబ అభివృద్ధి అజెండా అంటూ విమర్శలు
- వచ్చే ఎన్నికల్లో 80 శాతం సీట్లు ఎన్డీయేవేనని ధీమా

ఉత్తరప్రదేశ్: ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో అయోధ్య నుంచి పోటీ చేయాలని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ విసిరిన సవాల్‌ను ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వీకరించారు. అఖిలేశ్ యాదవ్ కూడా అయోధ్య నుంచి బరిలోకి దిగి తనపై పోటీ చేయాలని ప్రతి సవాల్ విసిరారు. ఇద్దరి మధ్య నేరుగా పోటీ జరిగితేనే తాను సిద్ధమని స్పష్టం చేశారు. అఖిలేశ్ ఇందుకు అంగీకరిస్తే తానూ పోటీకి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. శనివారం బలరాంపూర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న యోగి ఈ వ్యాఖ్యలు చేశారు. సమాజ్‌వాదీ పార్టీకి కుటుంబ ప్రయోజనాల గురించి తప్ప మరే ఇతర అంశాలపై ఆలోచన లేదని విమర్శించారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ ఇద్దరు అభ్యర్థులను బరిలోకి దింపిందని గుర్తుచేశారు. వారిలో అఖిలేశ్ యాదవ్ బాబాయి రామ్‌గోపాల్ యాదవ్ ఒకరని, మరో స్థానాన్ని పారిశ్రామికవేత్త ధన్‌రాజ్ పరిమల్ నత్వానీకి కేటాయించారని ఆరోపించారు. వెనుకబడిన వర్గాలు, దళితులు, బ్రాహ్మణులు సహా ఇతర సామాజిక వర్గాలకు సమాజ్‌వాదీ పార్టీ అవకాశం కల్పించలేదని విమర్శించారు. ఆ పార్టీ చెబుతున్న 'పీడీఏ' నినాదానికి కుటుంబ అభివృద్ధి సంస్థ, రాష్ట్రాన్ని ముంచే కూటమి అంటూ కొత్త అర్థాలు చెబుతూ ఎద్దేవా చేశారు. గతంలో సమాజ్‌వాదీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు యువతకు ఉద్యోగాలు లభించలేదని, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని యోగి ఆరోపించారు. అయోధ్యలో గతంలో రోజుకు మూడు, నాలుగు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా ఉండేదని, పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా ఉండేవని పేర్కొన్నారు. ప్రస్తుతం అయోధ్య నగరం రామరాజ్యానికి నిదర్శనంగా నిలుస్తోందని అన్నారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 80 శాతం స్థానాలను ఎన్డీయే కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. మిగిలిన స్థానాలు ఇతర పార్టీలకు దక్కినా బలరాంపూర్ అభివృద్ధి కార్యక్రమాలు మాత్రం ఆగబోవని స్పష్టం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై జరుగుతున్న నిరసనలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు హద్దులు దాటి వ్యవహరిస్తున్నాయని యోగి ఆరోపించారు.

షార్జా తీరంలో చమురు ట్యాంకర్‌పై డ్రోన్ దాడి

- 22 మంది భారతీయులు సురక్షితం
- పనామా నౌకపై అక్టోబర్ 9న దాడి
- ఎవరికీ గాయాలు కాలేదన్న కేంద్ర ప్రభుత్వం
- సముద్ర నౌకలు, సిబ్బంది భద్రతపై భారత్ ఆందోళన

న్యూఢిల్లీ: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని షార్జా తీరంలో లంగరు వేసి ఉన్న పనామా దేశానికి చెందిన క్రూడాయిల్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి జరిగింది. ఈ ఘటనలో నౌకలో పనిచేస్తున్న 22 మంది భారతీయ సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఎంటీ జీఈఎం నెం.2 పేరుతో ఉన్న ఈ చమురు ట్యాంకర్‌పై అక్టోబర్ 9న దాడి జరిగినట్లు కేంద్ర ఓడరేవులు, నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. ఈ ఘటనపై ఆయన సామాజిక మాధ్యమం ద్వారా స్పందిస్తూ, నౌకలోని భారతీయ సిబ్బంది క్షేమంగా ఉన్నారని పేర్కొన్నారు. నౌక నిర్వహణ సంస్థతో సంప్రదింపులు జరుపుతున్నామని, సిబ్బంది భద్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ దాడిని భారత్‌తో పాటు లైబీరియా కూడా ఖండించింది. వాణిజ్య నౌకలు, నావికా సిబ్బందిపై సముద్రంలో దాడులు జరగడం ఆందోళనకరమని పేర్కొన్నాయి. అంతర్జాతీయ సముద్ర రవాణా సజావుగా సాగేందుకు, నౌకల్లో పనిచేసే సిబ్బంది భద్రతను కాపాడేందుకు దేశాల మధ్య సహకారం, సమన్వయం అవసరమని స్పష్టం చేశాయి. ఈ వ్యవహారంపై కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ కూడా స్పందించారు. సముద్ర వాణిజ్యంలో భాగస్వాములైన దేశాలు, నౌకల జెండా దేశాలు, నావికా సిబ్బందికి చెందిన దేశాలు సమష్టిగా ముందుకు రావాలని సూచించారు. నౌకలు, వాటిపై పనిచేసే సిబ్బంది భద్రత కోసం తగిన చర్యలు, కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ లక్ష్యంతో ఏర్పాటైన 'గ్రూప్ ఆఫ్ ఫ్రెండ్స్ ఆన్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఆఫ్ షిప్పింగ్ సీఫేరర్స్' (జీఓఎఫ్) తొలి సమావేశం ఇప్పటికే న్యూయార్క్‌లో జరిగింది. ఈ భేటీకి 25 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో భద్రతను పటిష్ఠం చేయడం, వాణిజ్య నౌకలపై దాడులను నివారించడం, నావికుల రక్షణకు సమన్వయంతో చర్యలు చేపట్టడం వంటి అంశాలపై ఈ వేదిక ద్వారా దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని భారత్ నొక్కిచెప్పింది.

విద్యార్థి గుండుపై తబలా వాయించిన టీచర్ సస్పెన్షన్

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థి గుండుపై తబలా వాయిస్తూ అవహేళన చేసిన ఘటన వివాదాస్పదంగా మారింది. బాలుడి గుండుపై చేతులతో తబలా వాయిస్తున్నట్లుగా ప్రవర్తిస్తూ బిగ్గరగా నవ్విన ఉపాధ్యాయుడు, ఈ ఘటనను వీడియోగా రికార్డు చేయించారు. అనంతరం ఆ వీడియోను తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేయడంతో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో ఉపాధ్యాయుడి తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆయనపై విద్యాశాఖకు ఫిర్యాదులు అందడంతో అధికారులు చర్యలు చేపట్టి సస్పెండ్ చేశారు. ఈ ఘటన ఎటావా జిల్లాలోని సైఫాయి బ్లాక్ పరిధిలో ఉన్న బిరౌలి ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకుంది. అక్కడ అసిస్టెంట్ టీచర్‌గా పనిచేస్తున్న దినేశ్ కుమార్ మాథుర్ గుండు చేయించుకున్న ఓ విద్యార్థిని అవహేళన చేశారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు కుర్చీలో కూర్చోగా, విద్యార్థులు ఆయన చుట్టూ నేలపై కూర్చొని ఉన్నారు. ఈ క్రమంలో తన కుర్చీ ముందు కూర్చున్న బాలుడి గుండును తబలాతో పోల్చిన దినేశ్ కుమార్ మాథుర్.. సరదా పేరుతో రెండు చేతులతో దానిపై వాయిస్తూ పెద్దగా నవ్వారు. ఈ చర్యను చూసిన తోటి విద్యార్థులు సైతం నవ్వారు. ఈ ఘటనను అక్కడున్నవారు వీడియోగా చిత్రీకరించగా, ఉపాధ్యాయుడే స్వయంగా తన ఫేస్‌బుక్ ప్రొఫైల్‌లో అప్‌లోడ్ చేశారు. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించడంతో ఉపాధ్యాయుడి ప్రవర్తనపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థిని అవహేళన చేయడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన అధికారులు దినేశ్ కుమార్ మాథుర్‌ను తక్షణమే సస్పెండ్ చేశారు.

బౌలింగ్ బలంగా ఉంటే 2027 ప్రపంచకప్ మనదే

- వైభవ్ మరిన్ని మ్యాచ్‌లు ఆడాలి!
- సుదీర్ఘ కెరీర్‌పై దృష్టి పెట్టాలి
- తొలి బంతి నుంచే విరుచుకుపడే తత్వం నాలోనూ ఉంది
- టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్
- గిల్ డబుల్ సెంచరీపైనా ప్రశంసలు

న్యూఢిల్లీ: 2027లో దక్షిణాఫ్రికాలో జరగనున్న వన్డే ప్రపంచకప్‌లో భారత్ విజయం సాధించేందుకు బౌలింగ్ విభాగం కీలకమని టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. భారత ఫాస్ట్ బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా అత్యుత్తమ మని పేర్కొంటూ, ప్రపంచకప్ సమయానికి బౌలింగ్ దళం పటిష్ఠంగా ఉంటే భారత్ సులభంగా టైటిల్ గెలుచుకోగలదని ధీమా వ్యక్తం చేశాడు. శనివారం పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వార్షిక సమావేశంలో జరిగిన చర్చా కార్యక్రమంలో సెహ్వాగ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ భారత జట్టు తరఫున మరిన్ని మ్యాచ్‌లు ఆడుతూ సుదీర్ఘ కెరీర్‌ను నిర్మించుకోవాలని మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ఆకాంక్షించాడు. సూర్యవంశీ బ్యాటింగ్‌లో తన దూకుడును చూస్తున్నానని, తొలి బంతి నుంచే ఎదురుదాడికి దిగాలనే ఆలోచన ఇద్దరిలోనూ ఒకేలా ఉంటుందని పేర్కొన్నాడు. ప్రస్తుతం సూర్యవంశీ అత్యుత్తమ దశలో ఉన్నాడని, అతడికి ఎన్ని అవకాశాలు లభిస్తాయన్నదే కీలకమని అభిప్రాయపడ్డాడు.

వయసు కాదు.. ప్రతిభే ముఖ్యం

15 ఏళ్ల సూర్యవంశీ ఎనిమిది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 186 స్ట్రైక్‌రేట్‌తో 246 పరుగులు సాధించాడు. అతడి దూకుడును ప్రశంసించిన సెహ్వాగ్.. వయసు ఆధారంగా ఆటగాళ్ల సామర్థ్యాన్ని అంచనా వేయకూడదన్నాడు. ‘‘అండర్–19 వంటి వయోపరిమితి టోర్నీల్లో నిర్దేశిత వయసు నిబంధనలు పాటించాలి. కానీ ఐపీఎల్‌లోనో, భారత జట్టు తరఫునో ఆడుతున్నప్పుడు వయసు ముఖ్యం కాదు. 38 లేదా 40 ఏళ్ల విరాట్ కోహ్లీ ఆడుతున్నాడు.. 15 ఏళ్ల సూర్యవంశీ కూడా ఆడుతున్నాడు. అక్కడ ప్రదర్శనే కీలకం’’ అని వివరించాడు. భారత టెస్టు, వన్డే జట్ల కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆటతీరుపైనా సెహ్వాగ్ ప్రశంసలు కురిపించాడు. ఇటీవల వెస్టిండీస్‌తో గువాహటిలో జరిగిన రెండో వన్డేలో 133 బంతుల్లో 223 పరుగులు చేసి గిల్ రెండో వన్డే డబుల్ సెంచరీ సాధించడాన్ని గొప్ప ఘనతగా అభివర్ణించాడు. 2025లో ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్టుల్లో 754 పరుగులు చేసి, సునీల్ గావస్కర్ పేరిట ఉన్న 732 పరుగుల రికార్డును గిల్ అధిగమించిన విషయాన్ని గుర్తుచేశాడు. ప్రస్తుతం పలువురు భారత ఆటగాళ్లు అద్భుతంగా రాణిస్తున్నారని పేర్కొన్నాడు.

ఇండోర్‌లో పరుగుల వరదే!

- నేడు భారత్–వెస్టిండీస్ మూడో టీ20
- జోరుమీదున్న శ్రేయస్, సంజూ
- బౌలింగ్ వైఫల్యాలపై టీమిండియా దృష్టి

ఇండోర్: భారత్, వెస్టిండీస్ మధ్య టీ20 సిరీస్‌లో మరో పరుగుల పోరుకు రంగం సిద్ధమైంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో బ్యాటర్లు ఆధిపత్యం చెలాయించగా.. ఆదివారం ఇక్కడి హోల్కర్ స్టేడియంలో జరిగే మూడో టీ20లోనూ అదే జోరు కొనసాగే అవకాశముంది. ఫ్లాట్ పిచ్, చిన్న బౌండరీలతో బ్యాటింగ్‌కు అనుకూలమైన ఇండోర్‌లో బౌలర్లకు మరోసారి పరీక్ష తప్పేలా లేదు.

రాంచీలో జరిగిన రెండో టీ20లో ఇరు జట్లు కలిపి 501 పరుగులు చేయగా, భారత్ నిర్దేశించిన 250 పరుగుల భారీ లక్ష్యాన్ని వెస్టిండీస్ మరో ఓవర్ మిగిలుండగానే ఛేదించింది. దీంతో సిరీస్‌లో పైచేయి సాధించాలంటే ఇరు జట్లు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్, ఫీల్డింగ్‌లోనూ మెరుగ్గా రాణించాల్సి ఉంది. రెండో టీ20లో భారత్ ఓటమికి ఫీల్డింగ్ వైఫల్యాలు కూడా కారణమయ్యాయి. షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ 18 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఉండగా మయాంక్ యాదవ్ సులభమైన క్యాచ్‌ను వదిలేశాడు. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న రూథర్‌ఫర్డ్.. కెప్టెన్ షాయ్ హోప్‌తో కలిసి కేవలం 54 బంతుల్లోనే 120 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. రూథర్‌ఫర్డ్ 37 బంతుల్లో ఏడు ఫోర్లు, ఏడు సిక్సర్లతో 84 పరుగులు చేశాడు. హోప్ ఈ పర్యటనలో ఇప్పటికే రెండు శతకాలు సాధించడంతో భారత బౌలర్లు అతడిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది. మంచు ప్రభావం కూడా బౌలర్లకు సవాలుగా మారనుంది.

శ్రేయస్, సంజూపై ఆశలు

ఈ సిరీస్‌లో భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తిరిగి ఫామ్‌లోకి రావడం సానుకూలాంశం. మాజీ బ్యాటింగ్ కోచ్ అభిషేక్ నాయర్‌తో సాధన చేసిన తర్వాత అతడు మెరుగైన ప్రదర్శన చేస్తున్నాడు. అజేయంగా 102 పరుగులు చేయడంతో పాటు, మరో మ్యాచ్‌లో 18 బంతుల్లోనే 40 పరుగులు సాధించి తన దూకుడును చాటాడు. సంజూ శాంసన్ కూడా రెండో టీ20లో 41 బంతుల్లో 82 పరుగులు చేసి ఫామ్ అందుకున్నాడు. దీంతో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో అవకాశం దక్కడం కష్టంగా కనిపిస్తోంది. మిడిలార్డర్‌లో ఆటగాళ్ల స్థానాలను మార్చి ప్రయోగాలు కొనసాగిస్తామని ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఇప్పటికే స్పష్టం చేశాడు. రెండో మ్యాచ్‌లో శ్రేయస్ కంటే ముందుగా నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన శివమ్ దూబే ఏడు పరుగులకే వెనుదిరిగినా, ఆ ప్రయోగంపై జట్టు పెద్దగా ఆందోళన చెందడం లేదు.

బౌలింగ్ మెరుగుపడాల్సిందే

భారత ప్రధాన పేసర్ అర్ష్‌దీప్ సింగ్ రెండు మ్యాచ్‌ల్లో 79 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ మాత్రమే తీయడంతో అతడి ప్రదర్శనపై ఒత్తిడి పెరిగింది. మరోవైపు మయాంక్ యాదవ్ వేగంతో ఆకట్టుకుంటూ మొత్తం మూడు వికెట్లు పడగొట్టాడు. అతడి నుంచి మరోసారి అదే తరహా ప్రదర్శనను భారత్ ఆశిస్తోంది. వెస్టిండీస్ తరఫున రోస్టన్ చేజ్ రెండో మ్యాచ్‌లో 24 పరుగులిచ్చి మూడు వికెట్లు తీయడం జట్టుకు ఊరటనిచ్చింది. నాలుగు ఓవర్లలో 64 పరుగులిచ్చిన షమర్ స్ప్రింగర్ స్థానంలో మరో ఆటగాడిని తీసుకునే అవకాశముంది. హోప్, రూథర్‌ఫర్డ్ ఫామ్‌లో ఉండటం కరీబియన్ జట్టుకు కలిసొచ్చే అంశం.

జట్ల వివరాలు:

భారత్: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ఇషాన్ కిషన్, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), నామన్ ధీర్, వైభవ్ సూర్యవంశీ, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్, మయాంక్ యాదవ్.

వెస్టిండీస్: షాయ్ హోప్ (కెప్టెన్, వికెట్ కీపర్), జ్యువెల్ ఆండ్రూ, షిమ్రోన్ హెట్‌మయర్, అమీర్ జాంగూ, కమీల్ పూరన్, రోవ్‌మన్ పావెల్, షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్, క్వెంటిన్ సాంప్సన్, రోస్టన్ చేజ్, కీమో పాల్, రొమారియో షెపర్డ్, షమర్ స్ప్రింగర్, మాథ్యూ ఫోర్డ్, అకీల్ హోసేన్, షమర్ జోసెఫ్, గుడాకేశ్ మోతీ.

టీ20ల్లో ఓపెనర్లే శాశ్వతం

- బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు కొనసాగుతాయి
- టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్
- 250 పరుగులనూ కాపాడుకోలేకపోవడం జట్టు వైఫల్యమే
- దూబేను నాలుగో స్థానంలో పంపడం సమర్థనీయమే

రాంచీ: టీ20 క్రికెట్‌లో ఓపెనర్ల స్థానాలు మాత్రమే శాశ్వతమని, మిగతా బ్యాటింగ్ ఆర్డర్‌లో పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేస్తూనే ఉంటామని భారత జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. వెస్టిండీస్‌తో రెండో టీ20లో శివమ్ దూబేను నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు పంపడాన్ని సమర్థించాడు. ఆ మ్యాచ్‌లో దూబే 10 బంతుల్లో ఏడు పరుగులే చేసి వెనుదిరిగినా, గతంలోనూ ప్రపంచకప్‌తో సహా పలు సందర్భాల్లో అతడిని ఇదే స్థానంలో ఆడించామని గుర్తుచేశాడు. ఫామ్‌లో ఉన్న కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు బదులుగా దూబేను నాలుగో స్థానంలో పంపడంపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో గంభీర్ స్పందించాడు. ఇషాన్ కిషన్ ఔటైన తర్వాత దూబే క్రీజులోకి వచ్చాడు. వెస్టిండీస్ స్పిన్నర్ రోస్టన్ చేజ్ బౌలింగ్‌లో ఇబ్బందిపడి వికెట్ సమర్పించుకున్నాడు. అయినప్పటికీ, ఈ నిర్ణయాన్ని తప్పుగా చూడాల్సిన అవసరం లేదని కోచ్ అభిప్రాయపడ్డాడు. ‘అంతర్జాతీయ క్రికెట్‌లో కొన్నిసార్లు మనకు అనుకూలంగా జరుగుతుంది.. మరికొన్నిసార్లు అలా జరగదు. నాలుగో స్థానంలో దూబేను పంపడం వల్ల గతంలో మాకు మంచి ఫలితాలు వచ్చాయి. బ్యాటింగ్ క్రమంలో సౌలభ్యాన్ని పాటించడం మా విధానం. టీ20ల్లో ఓపెనర్లు మాత్రమే శాశ్వతం. మిగతా స్థానాల్లో మార్పులకు అవకాశం ఉండాలి’ అని గంభీర్ వివరించాడు.

ఓటమిని తేలిగ్గా తీసుకోం

రాంచీ మ్యాచ్‌లో భారత్ ఐదు వికెట్లకు 249 పరుగులు చేసినప్పటికీ, వెస్టిండీస్ 18.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 1–1తో సమం చేసింది. మంచు ప్రభావం, బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్ కారణంగా బౌలింగ్ కష్టమైందన్న విషయాన్ని అంగీకరించిన గంభీర్.. వాటిని ఓటమికి సాకుగా చూపబోమని స్పష్టం చేశాడు. ‘ఏ ఓటమినీ తేలిగ్గా తీసుకోకూడదు. మెరుగుపడాలంటే లోపాలను కప్పిపుచ్చుకోకూడదు. మేం ప్రపంచ ఛాంపియన్ జట్టుగా మరింత మెరుగవ్వాలని కోరుకుంటున్నాం. ఫ్లాట్ పిచ్‌లపై మంచు ప్రభావం ఉన్నప్పుడు బౌలింగ్ కష్టమే. అయినా, ప్రత్యర్థి తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లు, మొదటి ఆరు ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయిన తర్వాత కూడా భారీ లక్ష్యాన్ని కాపాడుకునే మార్గాలను కనుగొనాలి’ అని పేర్కొన్నాడు. వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ (102), షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ (84) అద్భుతంగా ఆడారని గంభీర్ ప్రశంసించాడు. ఈ ఫార్మాట్‌లో వారిద్దరూ ప్రపంచ స్థాయి బ్యాటర్లని కొనియాడాడు.

మయాంక్ వేగం భేష్!

భారత పేసర్ మయాంక్ యాదవ్ గంటకు 140 కిలోమీటర్లకు పైగా వేగంతో బౌలింగ్ చేస్తూ వెస్టిండీస్ టాప్ ఆర్డర్‌ను ఇబ్బందిపెట్టాడు. తొలి ఓవర్‌లోనే కమీల్ పూరన్, షిమ్రోన్ హెట్‌మయర్‌లను వరుస బంతుల్లో ఔట్ చేశాడు. అనంతరం గంటకు 149 కిలోమీటర్ల వేగంతో వేసిన బంతికి రోవ్‌మన్ పావెల్‌ను బౌల్డ్ చేశాడు. అయితే, తొలి ఓవర్‌లో వచ్చిన వికెట్లతోనే మ్యాచ్ ఫలితం నిర్ణయమవదని గంభీర్ అన్నాడు. ‘క్రికెట్ మ్యాచ్ 40 ఓవర్లలో జట్టు ఎలా నిలకడగా ఆడిందన్నదానిపై ఆధారపడి ఉంటుంది. ఫాస్ట్ బౌలర్ తన సహజ వేగంతోనే బౌలింగ్ చేయాలి. గంటకు 150 కిలోమీటర్ల వేగంతో వేయగలిగితే అలాగే వేయాలి. మయాంక్ అదే చేశాడు కాబట్టే విజయవంతమయ్యాడు’ అని పేర్కొన్నాడు.

రెన్‌షా డబుల్ సెంచరీ మిస్

- తొలి టెస్టులో ఆసీస్‌కు భారీ ఆధిక్యం

డర్బన్: మాట్ రెన్‌షా (190) కెరీర్‌లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో ఆస్ట్రేలియా పటిష్ఠ స్థితిలో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో 390 పరుగులకు ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా శనివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి 8.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 27 పరుగులు చేసింది. దీంతో ఆస్ట్రేలియా 363 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. వర్షం, ఇతర అంతరాయాల కారణంగా రెండో రోజు కూడా ఆటకు విఘాతం కలిగింది. నిర్ణీత సమయం కంటే 14.2 ఓవర్లు ముందుగానే ఆటను ముగించారు. తొలి రోజు 124 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన ఆస్ట్రేలియాను రెన్‌షా ఆదుకున్నాడు. 397 బంతులు ఎదుర్కొన్న అతడు 21 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 190 పరుగులు చేశాడు. ఉదయం సెషన్‌లో 204 బంతుల్లో రెండో టెస్టు శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అతడి గత శతకం 2017లో పాకిస్తాన్‌పై సిడ్నీలో నమోదైంది. అప్పుడు 184 పరుగులు చేశాడు.

తొమ్మిదో వికెట్‌కు 134 పరుగులు

రెన్‌షాకు నాథన్ లయన్ అండగా నిలిచాడు. 92 బంతుల్లో 27 పరుగులు చేసిన లయన్, రెన్‌షాతో కలిసి తొమ్మిదో వికెట్‌కు 283 బంతుల్లో 134 పరుగులు జోడించాడు. ఈ జోడీ దక్షిణాఫ్రికా బౌలర్లను దాదాపు రెండు సెషన్ల పాటు నిలువరించింది. ఆస్ట్రేలియా ఒక దశలో 84 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయినా, అనంతరం కోలుకుని 300 పరుగుల మార్కును దాటింది. లంచ్ సమయానికి 277/8తో నిలిచింది. లయన్‌ను మార్కో యాన్సెన్ ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపడంతో ఈ భాగస్వామ్యానికి తెరపడింది. యాన్సెన్ మూడు వికెట్లు తీశాడు. వియాన్ ముల్డర్ నాలుగు వికెట్లతో రాణించాడు.

దక్షిణాఫ్రికాకు తొలి దెబ్బ

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 390 పరుగుల వద్ద ముగిసింది. సైమన్ హార్మర్ బౌలింగ్‌లో స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి రెన్‌షా వెనుదిరిగాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా ర్యాన్ రికెల్టన్ వికెట్‌ను త్వరగానే కోల్పోయింది. జోష్ హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో అతడు డకౌటయ్యాడు. ఆట ముగిసే సమయానికి డేవిడ్ బెడింగ్‌హామ్ (12), ఐడెన్ మార్క్‌రమ్ (15) క్రీజులో ఉన్నారు. ప్రస్తుత ప్రపంచ టెస్టు ఛాంపియన్ దక్షిణాఫ్రికా 2025 ఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించి టైటిల్ సాధించింది. 2018లో బాల్ ట్యాంపరింగ్ వివాదం తర్వాత ఆస్ట్రేలియా తొలిసారిగా దక్షిణాఫ్రికాలో పర్యటిస్తోంది.

Business బిజినెస్

రియాద్‌కు విమానాల రద్దు పొడిగింపు

- ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సేవలు 14 వరకు నిలిపివేత
- ఎయిరిండియా సర్వీసులు 15వరకు రద్దు
- ప్రయాణికులకు పూర్తి రీఫండ్.. రీ షెడ్యూలింగ్ సదుపాయం



న్యూఢిల్లీ: సౌదీ అరేబియాలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో రియాద్‌కు రాకపోకలు సాగించే విమానాల రద్దును ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు పొడిగించాయి. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలను ఈ నెల 14 వరకు, ఎయిర్ ఇండియా సర్వీసులను 15 వరకు రద్దు చేసినట్లు అధికారులు శనివారం వెల్లడించారు. తొలుత ఈ నెల 10 వరకు విమానాలను రద్దు చేస్తున్నట్లు గురువారం ప్రకటించిన సంస్థలు.. తాజా పరిణామాలతో గడువును పెంచాయి. ప్రాంతీయ పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తూ, పరిణామాలను అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభావిత ప్రయాణికులకు టికెట్ల రద్దుపై పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లించనున్నట్లు వెల్లడించారు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఉచితంగా ప్రయాణ తేదీ మార్పునకు కూడా అవకాశం కల్పిస్తోంది.

వారానికి 23 సర్వీసులు

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ బెంగళూరు, కొచ్చి, కన్నూర్, కోజికోడ్ నుంచి రియాద్‌కు వారానికి 16 విమాన సర్వీసులు నడుపుతోంది. ఎయిర్ ఇండియా ఢిల్లీ, ముంబై నుంచి వారానికి ఏడు సర్వీసులు నిర్వహిస్తోంది. మరోవైపు, ఆకాశ ఎయిర్ కూడా రియాద్ విమానాలను ఈ నెల 11 వరకు రద్దు చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. ఇదిలాఉంటే ఈ వారంలో రియాద్, అభా నగరాల్లోని సౌదీ అరేబియా విమానాశ్రయాలపై హౌతీ మిలిటెంట్లు దాడులు చేసినట్లు సమాచారం. ఇరాన్ మద్దతున్న హౌతీ గ్రూపు, సౌదీ అరేబియా మధ్య ఇటీవలి రోజుల్లో ఉద్రిక్తతలు పెరిగాయి. డ్రోన్లు, క్షిపణులతో దాడులు జరుగుతున్న నేపథ్యంలో విమానయాన సంస్థలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి.

ఏఐ డేటా సెంటర్లకు గ్రీన్‌సిగ్నల్

- సబ్‌మర్ ఇండియాతో జట్టుకట్టిన బీఎస్ఎన్ఎల్
- 20 మెగావాట్ల కేంద్రాలు, స్వదేశీ క్లౌడ్ సేవల విస్తరణకు ప్రణాళిక

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ) కంప్యూటింగ్ మౌలిక వసతుల విస్తరణకు బీఎస్ఎన్ఎల్ టవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీటీసీఎల్), సబ్‌మర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. భారత్ మొబైల్ కాంగ్రెస్–2026 వేదికగా శుక్రవారం అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. గరిష్ఠంగా 20 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్లు, స్వదేశీ ఏఐ క్లౌడ్, జీపీయూ కంప్యూటింగ్, ఎడ్జ్, మైక్రో ఎడ్జ్ కేంద్రాల ఏర్పాటుపై సంయుక్తంగా అధ్యయనం చేయనున్నాయి. బీఎస్ఎన్ఎల్ దేశవ్యాప్త నెట్‌వర్క్, స్వదేశీ 4జీ, 5జీ మౌలిక వసతులు, ప్రాంగణాలను వినియోగించి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సురక్షితమైన, తక్కువ జాప్యంతో కూడిన ఏఐ సేవలు అందించే అవకాశాలను పరిశీలిస్తాయి. డేటా భద్రత, జాతీయ నిబంధనల అమలుకు ప్రాధాన్యమి వ్వనున్నాయి. డేటా సెంటర్ల రూపకల్పన, లిక్విడ్ కూలింగ్, విద్యుత్ సరఫరా, ఉష్ణ నియంత్రణలో సబ్‌మర్ తన సాంకేతిక నైపుణ్యాన్ని అందించనుంది. ప్రాంగణాలు, కనెక్టివిటీ, నియంత్రణపరమైన అనుసరణ, ప్రభుత్వ, పరిశ్రమల సంస్థలతో సమన్వయానికి బీటీసీఎల్ సహకరిస్తుంది. దేశ డిజిటల్ పరివర్తనకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని బీఎస్ఎన్ఎల్ సీఎండీ రాబర్ట్ జెరార్డ్ రవి, సంస్థ ఎంటర్‌ప్రైజ్ బిజినెస్ డైరెక్టర్ సుధాకర్ రావు పాపా తెలిపారు.

వాణిజ్య బంధానికి కొత్త ఊపు

- భారత్‌కు 300 మంది కెనడా వ్యాపార ప్రతినిధులు
- మూడు దశాబ్దాల్లోనే ఇది అతిపెద్ద వాణిజ్య బృందం
- స్వచ్ఛ సాంకేతికత, వ్యవసాయం, విమానయాన రంగాలపై దృష్టి
- 2030 నాటికి రూ.4.75లక్షల కోట్ల వ్యాపారమే లక్ష్యం

ఒట్టావా: భారత్‌తో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా కెనడా భారీ వాణిజ్య బృందాన్ని పంపుతోంది. 30 ఏళ్లకు పైగా కాలంలో ఎన్నడూ లేనివిధంగా దాదాపు 300 మంది వ్యాపార ప్రతినిధులు వచ్చే వారం భారత్‌లో పర్యటించనున్నారు. అక్టోబర్ 12 నుంచి 17 వరకు ముంబై, బెంగళూరులో పర్యటించే ఈ బృందానికి కెనడా అంతర్జాతీయ వాణిజ్య మంత్రి మనీందర్ సిద్ధూ నేతృత్వం వహించనున్నారు. 2030 నాటికి ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని రెట్టింపునకు మించి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విమానయానం, వ్యవసాయ–ఆహార ఉత్పత్తులు, స్వచ్ఛ సాంకేతికత వంటి రంగాల్లో కెనడా నైపుణ్యాన్ని, భారత్‌లో పెరుగుతున్న డిమాండ్‌తో అనుసంధానించడం ద్వారా వాణిజ్యాన్ని విస్తరించి, కొత్త పెట్టుబడులను ఆకర్షిస్తామని సిద్ధూ తెలిపారు. భారతీయ నిర్ణయాధికారులు, పరిశ్రమల ప్రముఖులు, సంభావ్య వినియోగదారులతో కెనడా వ్యాపార సంస్థలకు సంబంధాలు ఏర్పడటానికి ఈ పర్యటన దోహదపడుతుందని కెనడా ప్రభుత్వం పేర్కొంది. తద్వారా కెనడాలో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేసింది.

సమగ్ర వాణిజ్య ఒప్పందంపై దృష్టి

భారత్, కెనడా సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ)పై చర్చలను ఈ ఏడాది చివరికల్లా ముగించాలని ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా ఐదో విడత చర్చలు అక్టోబర్ 5 నుంచి 9 వరకు ఒట్టావాలో జరిగాయి. ఈ నెల 1న అమెరికాలోని మిల్వాకీలో జరిగిన జీ20 వాణిజ్య మంత్రుల సమావేశం సందర్భంగా భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్‌తో సిద్ధూ భేటీ అయ్యారు. ఒప్పంద చర్చల పురోగతి, వాణిజ్య–పెట్టుబడి సంబంధాల విస్తరణపై ఇరువురు చర్చించారు.

రూ.4.75 లక్షల కోట్ల వాణిజ్య లక్ష్యం

కెనడా ప్రధాని మార్క్ కార్నీ మార్చిలో భారత్‌లో పర్యటించిన సందర్భంగా సమగ్ర వాణిజ్య ఒప్పందం దిశగా ఇరు దేశాలు మరోసారి ప్రయత్నాలు ముమ్మరం చేయాలని నిర్ణయించాయి. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 70 బిలియన్ కెనడియన్ డాలర్లకు (సుమారు రూ.4.75 లక్షల కోట్లు) చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి. 2025లో వస్తువులు, సేవల రంగాల్లో ఇరు దేశాల మధ్య వాణిజ్యం 30.4 బిలియన్ కెనడియన్ డాలర్లుగా నమోదైంది. అదే ఏడాది భారత్‌కు కెనడా వస్తు ఎగుమతులు 3.9 బిలియన్ డాలర్లుగా ఉండగా, భారత్ నుంచి దిగుమతులు 9.7 బిలియన్ డాలర్లకు చేరాయి. కెనడా ఎగుమతుల్లో కూరగాయలు, ఖనిజ ఇంధనాలు, కలప గుజ్జు ప్రధానంగా ఉన్నాయి. భారత్ నుంచి విలువైన రాళ్లు, లోహాలు, యంత్రాలు, ఔషధ ఉత్పత్తులు అధికంగా దిగుమతి చేసుకుంది. తన ఎగుమతులను అమెరికాకు మాత్రమే పరిమితం చేయకుండా ఇతర దేశాలకు విస్తరించాలని కెనడా భావిస్తోంది. ఈ వ్యూహంలో భారత్‌కు కీలక స్థానం కల్పించింది. 2022లో ప్రారంభించిన ఇండో–పసిఫిక్ వ్యూహంలో భాగంగా వాణిజ్యం, భద్రత, సుస్థిరత, ప్రజల మధ్య సంబంధాలు, ప్రాంతీయ భాగస్వామ్యాన్ని కెనడా ప్రధాన ప్రాధాన్యాలుగా గుర్తించింది.

ఫోన్లు, ఏసీలు, ఫ్రిజ్‌లకు ఫుల్ డిమాండ్

- పండగవేళ జోరందుకున్న ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ విక్రయాలు
- తొలి గంటలోనే 30శాతం పెరిగిన గృహోపకరణాల అమ్మకాలు
- ట్యాబ్లెట్ల విక్రయాల్లో 73శాతం వృద్ధి.. చిన్న పట్టణాల్లోనూ భారీ స్పందన

బెంగళూరు: దీపావళి పండగను పురస్కరించుకుని కొత్త ఫోన్లు, ఏసీలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కొనుగోళ్లకు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. ఫ్లిప్‌కార్ట్ నిర్వహిస్తున్న 13వ విడత బిగ్ బిలియన్ డేస్ (టీబీబీడీ) విక్రయాల ప్రారంభ గంటలోనే ఈ ధోరణి స్పష్టమైంది. గత ఏడాదితో పోలిస్తే భారీ గృహోపకరణాల అమ్మకాలు తొలి గంటలో 30 శాతం పెరిగాయి. ట్యాబ్లెట్ల విక్రయాల్లో 73 శాతం వృద్ధి నమోదైంది. ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లకు అధిక డిమాండ్ కనిపించింది. మొబైల్ విభాగంలో ప్రీమియం, అత్యాధునిక స్మార్ట్‌ఫోన్ల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. కొనుగోలుదారుల్లో ప్రతి నలుగురిలో ఒకరు పాత ఫోన్ మార్పిడి పథకాన్ని ఎంచుకోగా, ప్రతి ముగ్గురిలో ఒకరు నో కాస్ట్ ఈఎంఐ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. గత ఏడాది ధరలకే అందుబాటులో ఉంచిన ప్రారంభ శ్రేణి 5జీ ఫోన్లకూ మంచి స్పందన లభించింది. పాత ఫోన్ల మార్పిడి విలువ, వాయిదాల చెల్లింపు సదుపాయాలు, బ్యాంకు ఆఫర్లు కలిసిరావడంతో పండగ కొనుగోళ్లకు వినియోగదారులు మొగ్గు చూపుతున్నారు.

నిమిషాల్లోనే డెలివరీ

ఫ్లిప్‌కార్ట్ త్వరిత డెలివరీ సేవ అయిన ఫ్లిప్‌కార్ట్ మినిట్స్‌లోనూ కొనుగోళ్లు భారీగా పెరిగాయి. సాధారణ రోజులతో పోలిస్తే విక్రయాల తొలి గంటలో ఆర్డర్లు 3.5 రెట్లు పెరిగాయి. ఈ సేవను తొలిసారిగా వినియోగించిన వారి సంఖ్య 11 రెట్లు అధికమైంది. ముందస్తు విక్రయాల సమయంలో ఢిల్లీలో ఓ వినియోగదారుడికి ఐఫోన్ 17ను కేవలం 3.4 నిమిషాల్లోనే అందించినట్లు సంస్థ తెలిపింది. ల్యాప్‌టాప్‌లు, ఎక్స్‌టర్నల్ హార్డ్‌డ్రైవ్‌లకూ డిమాండ్ కనిపించింది. ప్రస్తుతం మినిట్స్ సేవలో మొబైళ్లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులే అందుబాటులో ఉండగా, భారీ గృహోపకరణాలు లేవు. ఫ్లిప్‌కార్ట్ వేదికపై తొలి గంటలో నమోదైన సందర్శనల్లో దాదాపు సగం మూడో శ్రేణి పట్టణాలు, అ

దసరా కానుకగా 'క్రేజీ కల్యాణం'

నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, 'రాజు వెడ్స్ రాంబాయి' ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'క్రేజీ కల్యాణం'. యారో సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బద్రప్ప గాజుల దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమా దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిర్మాత బూసం జగన్ మోహన్ రెడ్డి సినిమా విశేషాలను పంచుకున్నారు. 'మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కథతో 'క్రేజీ కల్యాణం' చిత్రాన్ని రూపొందించాం. నిజానికి ఈ సినిమాను అక్టోబర్ 30న విడుదల చేయాలని తొలుత నిర్ణయించుకున్నాం. అయితే వెంకటేష్ నటించిన 'ఆదర్శ కుటుంబం' సినిమా వాయిదా పడటంతో మా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను పండుగ ప్రత్యేకంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించి అక్టోబర్ 16న విడుదల చేయాలని నిర్ణయించాం. మా సినిమా కంటెంట్‌పై మాకు పూర్తి నమ్మకం ఉంది. స్క్రిప్ట్ విన్న ప్రతి ఒక్కరూ కథ చాలా బాగుందని ప్రశంసించారు. అనుపమ పరమేశ్వరన్, నరేష్ గారు, తరుణ్ భాస్కర్, అఖిల్ సహా ప్రతి ఒక్కరూ కథపై సానుకూలంగా స్పందించారు. స్క్రిప్ట్‌పై మాకున్న నమ్మకానికి తోడు నటీనటుల నుంచి వచ్చిన స్పందన మా ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది. విడుదల తేదీ దగ్గరపడుతున్నప్పటికీ అనుపమ, నరేష్ గారు, తరుణ్ భాస్కర్ సహా నటీనటులందరూ బ్యాలెన్స్ షూటింగ్ కోసం ఎంతో సహకరిస్తున్నారు. ప్రతి ఒక్కరికీ సినిమాపై గట్టి నమ్మకం ఉంది. దర్శకుడు బద్రప్ప గాజులకు ఇది తొలి సినిమా అయినప్పటికీ, ఆయన గతంలో యాడ్ ఫిల్మ్‌కు పనిచేశారు. ఆయన ప్రతిభ గురించి నాకు తెలుసు. కథ కూడా అద్భుతంగా అనిపించడంతో ఎలాంటి సందేహం లేకుండా ఈ చిత్రాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చాను. ఈ సినిమా కోసం దాదాపు మూడేళ్లపాటు పనిచేశాం. ప్రతి ఒక్కరం ప్రాణం పెట్టి సినిమాను రూపొందించాం. ఇప్పటికే మా చిత్రానికి సంబంధించిన శాటిలైట్, ఓటీటీ, మ్యూజిక్ హక్కుల అమ్మకాలు పూర్తయ్యాయి. అనుకున్న బడ్జెట్‌లోనే సినిమాను పూర్తి చేశాం. నటీనటులందరూ ప్రమోషన్లకు చక్కగా సహకరిస్తున్నారు. సినిమా విడుదలైన తర్వాత ప్రేక్షకులు కూడా ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అని నిర్మాత బూసం జగన్ మోహన్ రెడ్డి వెల్లడించారు. కుటుంబమంతా కలిసి చూసేలా వినోదభరిత కథాంశంతో రూపొందిన 'క్రేజీ కల్యాణం' దసరా పండుగ సందర్భంగా ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

'కరికాల'లోకి కేథరిన్ థెరిసా ఎంట్రీ..

యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో సందీప్ కిషన్ వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇటీవల 'సిగ్మా', 'సూపర్ సుబ్బు' వంటి చిత్రాలతో సందడి చేసిన ఆయన ప్రస్తుతం 'కరికాల' అనే భారీ ఫాంటసీ అడ్వెంచర్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. 'శంబాల' సినిమాతో హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్న దర్శకుడు యుగంధర్ ముని ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. ఫైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సోషియో ఫాంటసీ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. ఇందులో భాగంగా 'కరికాల: చాప్టర్ 1'ను 2027 జూలై 2న, 'కరికాల: చాప్టర్ 2'ను 2027 అక్టోబర్ 28న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ భారీ ప్రాజెక్ట్‌లోకి తాజాగా మరో అందాల తార చేరింది. ప్రముఖ నటి కేథరిన్ థెరిసా ఈ సినిమాలో నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమెకు స్వాగతం పలుకుతూ ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేశారు. 'కరికాల అద్భుత ప్రపంచంలోకి కేథరిన్ థెరిసాకు స్వాగతం.. ఓ కొత్త సౌందర్యం, రహస్యం.. అద్భుతమైన అధ్యాయం' అంటూ చిత్రబృందం చేసిన ప్రకటన ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇదిలా ఉంటే, ఈ సోషియో ఫాంటసీ చిత్రంలో కేథరిన్ ఓ ప్రత్యేకమైన గ్లామరస్ పాటలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. సందీప్ కిషన్ కథానాయకుడిగా, యుగంధర్ ముని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రంలో కేథరిన్ థెరిసా ఎంట్రీతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. రెండు భాగాలుగా రూపొందుతున్న 'కరికాల' ప్రేక్షకులకు ఎలాంటి ఫాంటసీ ప్రపంచాన్ని పరిచయం చేయనుందో ఆసక్తికరంగా మారింది.

'జైలర్-2' టికెట్ ధరల పెంపునకు అనుమతి

సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్–2' విడుదల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సినిమా ప్రదర్శనకు సంబంధించి రాష్ట్రంలోని థియేటర్లలో టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. భారీ అంచనాల మధ్య విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్ర నిర్మాతలు సమర్పించిన విజ్ఞప్తిని పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రత్యేక ధరల పెంపు సినిమా విడుదలైన రోజు నుంచి వారం రోజుల పాటు, అంటే అక్టోబర్ 15 నుంచి 21 వరకు మాత్రమే అమల్లో ఉండనుంది. అనంతరం సాధారణ టికెట్ ధరలు పునరుద్ధరించనున్నారు. సినిమా విడుదల సందర్భంగా ప్రేక్షకుల నుంచి ఉండే ఆదరణ, చిత్ర నిర్మాణానికి అయిన భారీ వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని తొలి వారానికి ఈ వెసులుబాటు కల్పించినట్లు సమాచారం. పెంచిన ధరల వివరాల ప్రకారం సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒక్కో టికెట్‌పై రూ.50, మల్టీప్లెక్స్‌లలో ఒక్కో టికెట్‌పై రూ.75 వరకు అదనంగా వసూలు చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ అదనపు ధరలకు వర్తించే నిబంధనల ప్రకారం జీఎస్టీ కూడా చెల్లించాల్సి ఉంటుంది. తొలి వారంలో టికెట్ ధరల పెంపుతో 'జైలర్–2' ప్రదర్శనలపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. అయితే, ధరల పెంపునకు సంబంధించిన అధికారిక ఉత్తర్వుల పూర్తి వివరాలను పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయానికి సంబంధించిన అన్ని నిబంధనలపై స్పష్టత రానుంది.



మళ్లీ పట్టాలెక్కిన ఎన్టీఆర్ డ్రాగన్



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో, స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్' షూటింగ్ తిరిగి ప్రారంభమైంది. 'ఎన్టీఆర్ 31' అనే వర్కింగ్ టైటిల్‌తో మొదలైన ఈ చిత్రానికి మేకర్స్ 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. మైత్రి మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్, టీ–సిరీస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాలో రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తున్నారు. అనిల్ కపూర్, బిజు మీనన్, అశుతోష్ రాణా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది వేసవి కానుకగా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయాలని చిత్రబృందం తొలుత ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే ఇటీవల ఎన్టీఆర్ చేతికి గాయం కావడంతో సినిమా షూటింగ్‌కు తాత్కాలికంగా విరామం ఏర్పడింది. దీంతో చిత్రీకరణ ఆలస్యం కావడం, సినిమా అనుకున్న సమయానికి విడుదలవుతుందా లేదా అనే సందేహాలు అభిమానుల్లో వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా నటుడు బిజు మీనన్ షూటింగ్‌కు సంబంధించిన కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 'ఎన్టీఆర్ గారికి గాయం కావడంతో షూటింగ్ కొంతకాలం నిలిచిపోయింది. ఇప్పుడు తిరిగి ప్రారంభమైంది' అని వెల్లడించారు. దీంతో 'డ్రాగన్' చిత్రీకరణ మళ్లీ మొదలైనట్లు స్పష్టమైంది. బిజు మీనన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. షూటింగ్ తిరిగి ప్రారంభం కావడంతో ఎన్టీఆర్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'మాస్ తుఫాన్ మొదలైంది' అంటూ సోషల్ మీడియా వేదికగా తమ ఉత్సాహాన్ని పంచుకుంటున్నారు. అయితే సినిమా విడుదల తేదీపై చిత్రబృందం నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

'చంద్రయాన్'కు యు/ఎ సర్టిఫికెట్..

'రాజు వెడ్స్ రాంబాయి' సూపర్ హిట్ తర్వాత నిర్మాత వేణు ఊడుగుల తన సమర్పణలో మరో ఆసక్తికర చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. 'చంద్రయాన్' టైటిల్‌తో రూపొందిన ఈ సినిమాలో శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, బలగం సత్యనారాయణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సింబ స్క్రీన్ స్టోరీస్ బ్యానర్‌పై ప్రవీణ్ మొలక నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. హిలేరియస్ అడ్వెంచర్ కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా అక్టోబర్ 30న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో చిత్రబృందం ప్రమోషన్లను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు యు/ఎ సర్టిఫికెట్ జారీ చేసింది. గ్రామీణ నేపథ్యంలో సరికొత్త కథా కథనాలతో రూపొందిన ఈ సినిమా మంచి వినోదాన్ని అందిస్తుందని సెన్సార్ బృందం ప్రశంసించినట్లు చిత్ర వర్గాలు వెల్లడించాయి. ఇటీవల విడుదల చేసిన 'చంద్రయాన్' గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచడంతో పాటు, బలమైన కథాంశంతో కూడిన అడ్వెంచర్ అండ్ ఫన్ ఎంటర్‌టైనర్‌ను చూడబోతున్నామనే అంచనాలను ప్రేక్షకుల్లో కలిగిస్తున్నాయి.

ట్రోలింగ్‌తో మానసిక ప్రశాంతత కోల్పోయా

సినిమా ఇండస్ట్రీ బయటికి ఎంతో గ్లామరస్‌గా కనిపించినప్పటికీ, దాని వెనుక సెలబ్రిటీలు ఎన్నో మానసిక ఒత్తిళ్లను ఎదుర్కొంటారని అంటోంది టాలెంటెడ్ హీరోయిన్ తాప్సీ పన్ను. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె సోషల్ మీడియా ట్రోలింగ్, నటీనటులు ఎదుర్కొనే మానసిక ఇబ్బందుల గురించి కీలక విషయాలను వెల్లడించారు. సినిమా రంగంలో ఉంటూ నిరంతరం విమర్శలు, ట్రోలింగ్‌ను ఎదుర్కోవడం అంత సులభం కాదని ఆమె అభిప్రాయపడ్డారు. నటీనటులపై ప్రజల అభిప్రాయాలు వారి కెరీర్‌పై ప్రభావం చూపుతాయని, సరదాగా చేసే చిన్నచిన్న కామెంట్లు సైతం వారి మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఒక్కోసారి ఇలాంటి పరిణామాలు ప్రాణాల మీదకు తెచ్చేంతటి తీవ్ర ప్రభావాన్ని చూపవచ్చని అన్నారు. సోషల్ మీడియాలో అందరినీ సంతోషపెట్టాలనే ప్రయత్నంలో తాను ఎంతో మానసిక ప్రశాంతతను కోల్పోయానని తాప్సీ గుర్తుచేసుకున్నారు. ట్రోల్లర్లను మెప్పించేందుకు ప్రయత్నిస్తూ విలువైన సమయాన్ని వృథా చేసుకున్నానని వెల్లడించారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో తనతో తాను ఎక్కువ సమయం గడపాల్సి వచ్చిందని చెప్పారు. తెరపై ఎంతో గ్లామరస్‌గా కనిపించే నటీనటులు కూడా సాధారణ మనుషులేనని, వారికి కూడా భావోద్వేగా లు, వ్యక్తిగత సమస్యలు ఉంటాయని ప్రతి ఒక్కరూ గుర్తించాలని తాప్సీ కోరారు. ఇతరులపై కామెంట్లు చేసే ముందు వారి మానసిక పరిస్థితిని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేశారు.

పూజా మేరీ జాన్'పై మృణాల్ ఎమోషనల్

'సీతారామం' సినిమాతో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న టాలెంటెడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ నటించిన 'పూజా మేరీ జాన్' ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దాదాపు నాలుగేళ్ల నిరీక్షణ తర్వాత థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలో విడుదలైన ఈ చిత్రం ప్రస్తుతం ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకుంటోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ సినిమా విశేషాలతో పాటు తన అనుభవాలను పంచుకున్నారు. ఇన్నాళ్ల నిరీక్షణ గురించి మాట్లాడుతూ.. ప్రతి విషయం జరగాల్సిన సమయంలోనే జరుగుతుందని, 'పూజా మేరీ జాన్' తనకు మొదటి బిడ్డ లాంటిదని భావోద్వేగానికి గురయ్యారు. సినిమా చిత్రీకరణ పూర్తయి చాలా కాలం గడిచినా, అప్పటి జ్ఞాపకాలు తన మనసులో ఇప్పటికీ తాజాగా ఉన్నాయని తెలిపారు. ఈ క్రమంలో తాను రెండు ఫోన్లు మార్చినప్పటికీ, పాత ఫోన్‌లో భద్రపరిచిన షూటింగ్ జ్ఞాపకాలు, ఆ సమయంలో పాటించిన కఠినమైన ఆహార నియమాలు ఇప్పటికీ స్పష్టంగా గుర్తున్నాయని వెల్లడించారు. ఈ సినిమా కేవలం వినోదాన్ని అందించే కథ మాత్రమే కాదని, సమాజంలో నిరంతరం చర్చించాల్సిన ఓ సున్నితమైన అంశాన్ని ప్రస్తావిస్తుందని మృణాల్ పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళల సమ్మతి, వారి నిర్ణయాలను గౌరవించడం ఎంత ముఖ్యమో ఈ చిత్రం తెలియజేస్తుందని వివరించారు. సినిమా చూసిన తర్వాత పలువురు యువకులు తనకు ఫోన్ చేసి, ఒక అమ్మాయి 'వద్దు' అని చెబితే దాని అర్థం నిజంగానే 'వద్దు' అని తెలుసుకున్నామని చెప్పడం ఎంతో సంతృప్తినిచ్చిందని ఆమె వెల్లడించారు. మహిళలపై సమాజం చేసే తీర్పులు, వ్యక్తిగత జీవితాలపై సాగించే చర్చల గురించి కూడా మృణాల్ ఆసక్తికరంగా స్పందించారు. '[ప్రస్తుతం మన గురించి మాట్లాడటానికి ఏమీ లేనప్పుడు కొంతమంది కావాలనే మన గతాన్ని తవ్వుతుంటారు. నా విషయంలోనూ సరిగ్గా అదే జరుగుతోంది' అంటూ తనపై వస్తున్న ఊహాగానాలపై పరోక్షంగా వ్యాఖ్యానించారు. మొత్తానికి, నాలుగేళ్ల తర్వాత విడుదలైన 'పూజా మేరీ జాన్' తనకు ఎంతో ప్రత్యేకమైన చిత్రమని చెప్పిన మృణాల్ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

'ఇరందు వానం' వాయిదా?



విష్ణు విశాల్, మమితా బైజు జంటగా నటిస్తున్న లేటెస్ట్ లవ్ ఎంటర్‌టైనర్ 'ఇరందు వానం' విడుదల వాయిదా పడనున్నట్లు కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. రామ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 23న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ఇప్పటికే చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అయితే తాజాగా ఈ సినిమా విడుదల తేదీలో మార్పు ఉండనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం.. 'ఇరందు వానం' చిత్రాన్ని డిసెంబర్‌లో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్ 15న రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. 'జైలర్ 2' విడుదలైన మరుసటి వారంలోనే తమ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తే థియేటర్ల కేటాయింపులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని చిత్రబృందం భావిస్తున్నట్లు టాక్. అదే సమయంలో డిసెంబర్‌లో కోలీవుడ్ నుంచి పెద్ద సినిమాల విడుదల పోటీ తక్కువగా ఉండే అవకాశం ఉండటంతో 'ఇరందు వానం' చిత్రానికి అనుకూలమైన రిలీజ్ విండో లభిస్తుందని మేకర్స్ అంచనా వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే సినిమా విడుదల వాయిదాపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ఈ వార్తల్లో నిజానిజాలు తెలియాలంటే చిత్రబృందం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.